సంపుటి : 10
సంచిక : 08
ఆదివారం
04 అక్టోబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELERRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999



శ్రీసిటీలో

## ఘోర ప్రమాదం

- టిల్ హెల్త్‌కేర్ పరిశ్రమలో పేలిన బాయిలర్
- ఐదుగురు కార్మికుల దుర్మరణం
- సమగ్ర విచారణకు ప్రభుత్వ ఆదేశం
- బాయిలర్ ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు
- బాధితులకు ఒక్కొకరికి రూ.50 లక్షల నష్ట పరిహారం
- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

**శ్రీసిటీ, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతి జిల్లాలోని ప్రముఖ పారిశ్రామిక నగరం శ్రీసిటీలోని టిల్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ (ట్యాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్) పరిశ్రమలో శనివారం బాయిలర్ పేలి ఐదుగురు కార్మికులు దుర్మరణం చెందారు. సత్యవేడు మండలం చెరివి వద్ద ఉన్న ఈ ఫార్మా యూనిట్‌లో ఉదయం 8.20 నుంచి 8.27 గంటల మధ్య రెండు టన్నుల మిగతా .. 2లో..




# ఏపీకి ఐఐటీయన్ల మేధస్సు

- వరల్డ్ పాన్ ఐఐటీ కౌన్సిల్‌కు వేదికగా అమరావతి
- డీప్ టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్లతో పాన్ ఐఐటీ వెంచర్ ఫండ్
- 100 మందితో గ్లోబల్ ఐఐటీ మెంటర్ల నెట్ వర్క్
- ఏపీకి టెక్నాలజీని ట్రాన్స్‌ఫర్ చేసేందుకు 23 ఐఐటీల అంగీకారం
- పాన్ ఐఐటీ ఏపీ 2026 సదస్సులో సీఎం సమక్షంలో డిక్లరేషన్ విడుదల
- క్యు-శివ పేరుతో ఐదు క్వాంటం కంప్యూటర్లను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
- 2027 ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్లు

**విజయవాడ, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఐఐటియన్ల మేధస్సు ఉపయోగపడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలతో పాటు దేశాభివృద్ధి కోసం వారంతా అనుసంధానమై నెట్వర్క్ గా ఏర్పడాలని ఆయన సూచించారు. శనివారం విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన పాన్ ఐఐటీ ఏపీ సమ్మిట్ 2026లో పాల్గొన్న ముఖ్యమంత్రి అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ నాలెడ్జ్, డీప్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగులు పడ్డాయని వ్యాఖ్యానించారు. అమరావతిలో పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో పాటు, డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులకు ఊతమిచ్చేలా రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు క్యు-శివ పేరుతో రూపొందించిన ఐదు క్వాంటం కంప్యూటర్లను ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ రూపొందించిన ఈ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం కంప్యూటర్ ల్యాబ్‌లుగా ఉపయోగ పడనున్నాయి. 4 కెల్విన్ ప్రాసెసర్ సృష్టిని కూడా సీఎం ఆవిష్కరించారు. మేడిన్ అమరావతి బ్రాండ్ సృష్టించేలా క్వాంటం కంప్యూటర్ల తయారీకి శ్రీకారం చుట్టడం రాష్ట్రంలో డీప్‌టెక్ ఉత్పత్తుల తయారీ మిగతా .. 2లో..

‘మాకు గర్వకారణం’..

స్మిత్ మచ్చర్‌కు దుబాయ్ యువరాజు పరామర్శ



**అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్లైదుబాయ్ విమాన ఘటనలో తీవ్రంగా గాయపడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రస్తుతం యూఏఈలోని అబుధాబీలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆయన వేగంగా కోలుకుంటున్నారని యూఏఈలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. “భారత ధైర్యశాలి కెప్టెన్ స్మిత్ మెరుగైన వైద్య సంరక్షణలో ఉన్నారు. వేగంగా కోలుకుంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, స్థానిక అధికారులతో టచ్‌లో ఉన్నాం. యూఏఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు” అని భారత ఎంబసీ తెలిపింది. మరోవైపు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్‌ను యూఏఈ ఉప ప్రధాని, దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్ పరామర్శించారు. “ప్రయాణికుల ప్రాణాల విషయంలో అత్యంత ధైర్యసాహసాలు కనబర్చిన మిగతా .. 2లో..

సెల్యులాయిడ్ సైంటిస్ట్

## సింగీతం ఇకలేరు

చెన్నై ఆసుపత్రిలో కన్నుమూత



**చెన్నై, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రయోగాలకు పెద్దపీట వేస్తూ.. వైవిధ్యభరిత కథలతో సినీ ప్రియుల్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేసిన దర్శక మాంత్రికుడు సింగీతం శ్రీనివాసరావు (95) ఇకలేరు. కొంతకాలంగా వయోధిక ఆరోగ్య సమస్యలతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. వయసు అనేది కేవలం అంకె మాత్రమేనని నిరూపిస్తూ ఆఖరి శ్వాస వరకు వెండితెరపై సరికొత్త ప్రయోగాలు చేస్తూ అద్భుతాలు సృష్టించిన ఈ మహాదర్శకుడి నిష్క్రమణతో ఒక అద్భుత శకం ముగిసింది. సుదీర్ఘ మిగతా .. 2లో..



పరిశ్రమలను మేం జాతి నిర్మాణకర్తలుగా

# భావిస్తున్నాం

- ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే మా లక్ష్యం
- చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది
- పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకునేలా ఉండాలి
- పాన్ ఐఐటి సమ్మిట్ -2026లో విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్

**అమరావతి, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశం ఇప్పటివరకు చూడని మార్పు, అభివృద్ధి, సుపరిపాలనని తీసుకురావడానికి మేము తపన పడుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చేందుకు మా టీం ఉమ్మడి లక్ష్యంతో పనిచేస్తోందని ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. పాన్ ఐఐటి సమ్మిట్ - 2026లో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మేము అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదగాలి... మోదీజీ ‘వికసిత్ భారత్’ లక్ష్యానికి మా వంతు సహకారం అందించాలన్నదే మా ధ్యేయం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్ తో మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది. 50% శాసనసభ్యులు మొదటిసారి గెలిచినవారే, 25 మంది మంత్రులలో 17 మంది మొదటిసారి మంత్రులైనవారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా, విభిన్నంగా మిగతా .. 2లో..

సైబర్‌స్పేస్‌లో

## బాలలకు భద్రత

- అన్ని శాఖలూ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి
- పిల్లలు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు దృష్టి సారించాలి
- నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ దక్షిణాది సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పిల్లల న్యాయసేవలకు ఉమ్మడి సంకల్పం తీసుకుందామన్న కేంద్ర మంత్రి మేఘ్‌వాల్



**హైదరాబాద్, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** సైబర్ నేరాల నుంచి పిల్లలను రక్షించడం, వారికి న్యాయం అందేలా చూడటం లక్ష్యంగా సమగ్ర బాలల ఆన్‌లైన్ భద్రతా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మిగతా .. 2లో..

జనసేనలో 12 ఏళ్లుగా పనిచేసినా

## గుర్తింపు లేదు

- కాంగ్రెస్‌లో చేరిన 30 మంది నాయకులు
- రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ శౌంరి నాగరాజు
- నాయకత్వంలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు



**విజయవాడ, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీలో దాదాపు 12 సంవత్సరాలుగా కష్టపడి పనిచేసినప్పటికీ సరైన గుర్తింపు, రాజకీయ ప్రాధాన్యత లభించకపోవడంతో పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీలో నెలకొన్న వర్గపోరు కారణంగా మచిలీపట్నం నియోజకవర్గానికి చెందిన షేక్ చిన్న భాజీ నాయకత్వంలో సుమారు 30 మంది జనసేన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. విజయవాడ ఆంధ్ర రత్న భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి మిగతా .. 2లో..

లోక్‌సభతో పాటు అసెంబ్లీలనూ

## రద్దు చేయాలి

- బ్యాలెట్ పత్రాలతో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్



**బెంగళూరు, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నికల వ్యవస్థ అంతా అక్రమాలమయమైందని, అందువల్ల లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసి మళ్లీ బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఈ అస్తవ్యస్తమైన ఎన్నికల వ్యవస్థతో గెలిచిన ప్రధాని, హోం మంత్రులే కాదు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులూ అక్రమంగా మిగతా .. 2లో..

షేక్ హసీనా అప్పగింతపై

## గడువు చెప్పలేం

- భారత్ హైకమిషనర్



**అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలన్న బంగ్లాదేశ్ అభ్యర్థనపై చట్టపరమైన ప్రక్రియ ద్వారా పరిశీలన జరుగుతోందని ఆ దేశంలోని భారత హైకమిషనర్ దినేష్ త్రివేది తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమె అప్పగింతపై గడువు చెప్పలేమన్నారు. ఢాకాలో నిర్వహించిన ఓ చర్చా కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. “షేక్ హసీనాను భారత వైమానిక దళమో.. లేదా సైన్యమో తరలించలేదు. నిరసనల సమయంలో బంగ్లాదేశ్ వాయుసేన విమానంలోనే ఆమె భారత్‌కు చేరుకున్నారు. అప్పటికీ మిగతా .. 2లో..

బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు

## వైసీపీకి లేదు

- బీసీలకు అధికారం దక్కకూడదని వైసీపీ కుట్ర చేసిందన్న రామ్మోహన్ నాయుడు
- రిజర్వేషన్ల కోసం కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడుతోందని వెల్లడి
- టీడీపీకి బీసీలు వెన్నెముక వంటివారని వ్యాఖ్య



**శ్రీకాకుళం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని ఆయన ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోవిందరావుతో కలిసి మిగతా .. 2లో..

సుప్రీం తీర్పు తర్వాతే

## మున్సిపల్ ఎన్నికలు

- బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి నారాయణ
- గత ప్రభుత్వం వల్లే అమరావతి అభివృద్ధి ఆగిపోయిందని విమర్శ



**అమరావతి, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఆయన మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఏపీకి ఐఐటీయన్ల మేధస్సు

సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచిందని ముఖ్యమంత్రి అన్నారు. క్యు-శివ కంప్యూటర్ల తయారీలో కీలకంగా వ్యవహరించిన చండీగఢ్ యూనివర్సిటీ, క్యూబిట్ ఫోర్స్ ప్రతినిధులను సీఎం అభినందించారు. క్యు-శివ క్వాంటం కంప్యూటర్లను తయారు చేయడానికి అసరమైన కాంపోనెంట్లు మచిలీపట్నంలోనే లభ్యమవుతున్నాయని ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వివరించారు.

**అమరావతిలో క్వాంటం ఎకోసిస్టం అభివృద్ధి**

దేశంలోని 23 ఐఐటీలు ప్రపంచానికి అత్యుత్తమ మేధస్సును అందించాయని, జాతి నిర్మాణంలో ఐఐటీయన్ల పాత్ర కీలకమని సీఎం చంద్రబాబు అన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలను చేరుకునేలా ఐఐటీయన్లు తమ మేధస్సును వినియోగించాలని కోరారు. సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడినట్లే ఇకపై అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం మాట్లాడుతుందన్నారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించి ఇప్పటికే టెస్ట్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయని సీఎం తెలిపారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్అండ్‌టీ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న క్వాంటం కంప్యూటర్ అమరావతి నుంచి ఆపరేట్ కానుందని, వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ ప్రారంభమవుతాయని సీఎం వెల్లడించారు. 156 క్యూబిట్ క్వాంటం సిస్టమ్ అందుబాటులోకి వచ్చేలోగానే అమరావతిలో క్వాంటం టెక్నాలజీకి అవసరమైన మౌలిక వసతులు సిద్ధమవుతున్నాయని చెప్పారు. భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్లను మాత్రమే కాకుండా వాటికి అవసరమైన పరికరాలను కూడా తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఏపీ ఎదగాలని సీఎం ఆకాంక్షించారు. భారత్, ఆంధ్రప్రదేశ్ కేవలం టెక్నాలజీ వినియోగదారులుగా కాకుండా ఉత్పత్తిదారులుగా ఎదగాలని సీఎం పిలుపునిచ్చారు. వచ్చే రెండేళ్లలో కమర్షియల్ క్వాంటం కంప్యూటర్ల ఉత్పత్తికి అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రాష్ట్రంలో నైపుణ్యాలు, పరిశోధన, తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఐఐటీ స్థాయి ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని, ఆరో తరగతి నుంచే విద్యార్థుల్లో ఎంట్రప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలను పెంపొందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దీనికి ఐఐటీల సహకారాన్ని అందించేందుకు ముందుకు వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు.

**మంచి ఆలోచన ఆచరణలో పెడితే విప్లవం**

వినూత్న ఆలోచనలకు తాను ఎప్పుడూ ప్రాధాన్యమిస్తారనని సీఎం చెప్పారు. రాళ్ల సీమగా ఉన్న రాయలసీమను రతనాల సీమగా మార్చాలనే ఆలోచన నుంచే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటైందని తెలిపారు. ఇప్పుడు ఈ హబ్ ద్వారా రాయలసీమలో విప్లవాత్మకమైన అభివృద్ధి వస్తుందన్నారు. 20 రకాల ఫలాలు ఉత్పత్తి అవుతున్న రాయలసీమను సమర్థవంతమైన నీటి నిర్వహణ, ఆధునిక సాంకేతికతతో వచ్చే పదేళ్లలో ప్రపంచ ఉద్యానవన హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తున్నామని, దీనికి రిలయన్స్ సంస్థ సహకారం అందించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. దేశంలో కోటి మంది ఏఐ నిపుణులను తయారు చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఏపీ నుంచి 50 లక్షల మంది ఏఐ నిపుణులను అందించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని సీఎం వెల్లడించారు. టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటే అభివృద్ధి లక్ష్యాలను మరింత వేగంగా చేరుకోవచ్చని ముఖ్యమంత్రి అన్నారు.

**పాన్ ఐఐటీ ఏపీ సమ్మిట్ డిక్లరేషన్**

సమ్మిట్ లో జరిగిన సుదీర్ఘ మేథోమథనం అనంతరం పాన్ ఐఐటీ ప్రతినిధులు, ఏపీ ప్రభుత్వం ఉమ్మడిగా డిక్లరేషన్ విడుదల చేశాయి. అమరావతిలో పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్ ఏర్పాటు కానుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐఐటీ పూర్వ విద్యార్థులు, విద్యావేత్తలు, పరిశ్రమలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలను అనుసంధానం చేసే వేదికగా ఈ కౌన్సిల్ పని చేయనుంది. దేశంలోని 23 ఐఐటీల నుంచి వచ్చిన సుమారు 5 లక్షల మంది ఐఐటీయన్ల మేధస్సును ఏపీ అభివృద్ధికి వినియోగించుకునేలా ఈ నెట్‌వర్క్‌ను తీర్చిదిద్దనున్నారు. డీప్‌టెక్ అభివృద్ధికి పాన్ ఐఐటీ అమరావతి కౌన్సిల్ నోడల్ సంస్థగా పనిచేయనుంది. 23 ఐఐటీలు, 25 ఇన్నోవేషన్ హబ్‌ల నుంచి సాంకేతికతలను గుర్తించి వాటిని ఆంధ్రప్రదేశ్‌లోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, ఉత్పత్తుల అభివృద్ధికి అందుబాటులోకి తీసుకురానున్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను పాన్ ఐఐటీ ఎకోసిస్టంతో అనుసంధానం చేసి పరిశోధన, ఫ్యాకల్టీ, విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు 10 ఇండస్ట్రీ చాప్టర్లను ఏర్పాటు చేసి పరిశోధన, నైపుణ్యాలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 100 మంది ఐఐటీ మెంటర్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి ఏపీ స్టార్టప్‌లు, ఔత్సాహికులకు మార్గనిర్దేశం చేయనున్నారు. 2030 నాటికి రాష్ట్రంలో కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్, హెల్త్, అగ్రిటెక్, బ్లూ వాటర్ ఎకానమీ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా డీప్‌టెక్ పాలసీ ప్యాకేజీ కింద చర్యలు చేపట్టనున్నారు. రూ.500 కోట్ల వెంచర్ ఫండ్‌ను డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, కొత్త టెక్నాలజీలకు పెట్టుబడులుగా వినియోగించనున్నారు.

**వివిధ రంగాలపై ప్యానెల్ డిస్కషన్లు**

రెండు రోజుల పాటు జరిగిన పాన్ ఐఐటీ సదస్సులో ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ తిరుపతి, ఐఐటీ జమ్మూ, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ ధన్‌బాద్, ఐఐటీ వారణాసి, ఐఐటీ భువనేశ్వర్ తదితర సంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు. ఐఐటీల సీఈఓలు, వెంచర్ క్యాపిటలిస్టులతో రెండు రోజు సదస్సులో సీఎం సమావేశమై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, టెక్నాలజీ బదిలీ, పట్టణీకరణలో డీప్‌టెక్ వినియోగం, స్టార్టప్‌లు, పెట్టుబడులు తదితర అంశాలపై చర్చించారు. ప్రతి ఏడాది పాన్ ఐఐటీ సమ్మిట్ నిర్వహించి వివిధ అంశాలపై చర్చించాలని సీఎం ప్రతిపాదించారు. అంతకుముందు ఇంధనం, స్వచ్ఛాంధ్ర, నిత్య జీవితంలో డీప్ టెక్, స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, అందరికీ ఆరోగ్య సంరక్షణ సేవలు, అగ్రిటెక్-రైతులు, నీటిభద్రత తదితర అంశాలపై పాన్ ఐఐటీ సదస్సులో చర్చలు జరిగాయి. పాన్ ఐఐటీ సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం ఆసక్తిగా తిలకించారు.

# శ్రీసిటీలో ఘోర ప్రమాదం

సామర్థ్యం గల బాయిలర్‌లో నిర్దేశిత స్థాయి కంటే నీటిమట్టం పడిపోవడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. బాయిలర్ ఆపరేటర్, ఈటీపీ సిబ్బందిగా విధులు నిర్వర్తిస్తున్న తమిళనాడు రాష్ట్రం నాయుడుకుప్పానికి చెందిన మోహన్ (19), చెరివి గ్రామానికి చెందిన చిన్న మస్తాన్ (36), పశ్చిమబెంగాల్‌కు చెందిన గౌరబ్ రాయ్ (36) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి బాయిలర్ వద్ద ఉన్న భవనం తీవ్రంగా ధ్వంసమైంది. ఆ శిథిలాల కింద పడి తమిళనాడు రాష్ట్రం మాదరపాకానికి చెందిన రమేష్ (47), వేగంగా దూసుకొచ్చిన పెళ్లలు తగలడంతో తడకు చెందిన వాసు (35) తీవ్ర గాయాల పాలయ్యారు. రమేష్ అక్కడే ప్రాణాలు విడవగా.. వాసు చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. పేలుడు ధాటికి సమీప పరిశ్రమలకు చెందిన అద్దాలు పగిలిపోయాయి. దగ్గర్లోని ఇళ్లు సైతం కొంతమేర దెబ్బతిన్నాయి. శ్రీసిటీ స్థాపించిన తర్వాత వచ్చిన తొలి యూనిట్ టిల్ హెల్త్‌కేర్ సంస్థనే కావడం గమనార్హం. ఇక్కడి నుంచి ఆఫ్రికా, ఐరోపా, ఆసియా ఖండాల్లోని 54 దేశాలకు ఔషధాలు ఎగుమతి చేస్తుంటారు. 2008లో శ్రీసిటీలో కార్యకలాపాలు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క ప్రమాదమూ జరగలేదని, తొలి ప్రమాదం ఇదేనని అధికారులు చెబుతున్నారు. అప్పుడే బస్సు దిగిన 50 మంది..: అక్టోబరు 2న గాంధీ జయంతి కావడంతో పరిశ్రమలో ఆ రోజు ఎవరూ విధుల్లో లేరు. శనివారం ఉదయం 6.30కి బాయిలర్ వద్ద పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది వచ్చారు. ఉదయం 8.20 నుంచి 8.27 గంటల మధ్య 50 మంది కార్మికులు బస్సు దిగి పరిశ్రమ వద్దకు వస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఘటనాస్థలికి దూరంగా ఉండటంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదం నేపథ్యంలో బాయిలర్ల పర్యవేక్షణ సక్రమంగా లేదని భావించిన ప్రభుత్వం.. బాయిలర్ ఇన్‌స్పెక్టర్ రాంబాబును సస్పెండ్ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో టిల్ హెల్త్‌కేర్ పరిశ్రమకు చెందిన బాయిలర్‌ను తనిఖీ చేశారు. దీన్ని 25 ఏళ్ల పాటు వినియోగించుకునే అవకాశం ఉండగా, ఇప్పటికే దాన్ని కొనుగోలు చేసి పన్నెండున్నరేళ్లు అయ్యిందని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. అంత్యక్రియలకు వెంటనే రూ.లక్ష చొప్పున అందజేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు ప్రమాద ప్రాంతానికి చేరుకొని, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మరణించిన వ్యక్తుల కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం, పిల్లలుంటే వారి చదువుల బాధ్యతను కూడా శ్రీసిటీ చూసుకుంటుందని తెలిపారు. ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై విచారణలకు బాయిలర్స్, ఫ్యాక్టరీస్, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో సంయుక్త కమిటీని ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

**గవర్నర్, సీఎం దిగ్భ్రాంతి**

ఈ ఘటనపై గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణాలు, సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రులు లోకేశ్, సత్యకుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మాజీ సీఎం జగన్‌లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**సేఫ్టీ ఆడిట్ నిర్వహించండి: పవన్ కల్యాణ్**

ప్రమాద ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఆయన జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శ్రీసిటీలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై సమీక్షించాలని సూచించారు. ప్రమాద ఘటనపై సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు.

**తగినంత నీరు లేకపోవడంతోనే: మంత్రి సుభాష్**

బాయిలర్‌లో సరిపడా నీరు లేకపోవడమే పేలుడుకు ప్రధాన కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. టిల్ హెల్త్ కేర్ కంపెనీలో ఈ ఏడాది ఏప్రిల్ 7న సేఫ్టీ ఆడిట్ జరిగిందని, అన్నీ సక్రమంగా ఉన్నాయని సర్టిఫై చేశారని వెల్లడించారు.

# సింగీతం ఇకలేరు

సినీ ప్రయాణంలో తెలుగుతో పాటు తమిళం, కన్నడ, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించిన ఆయన.. 94 ఏళ్ల వయసులో తన చివరి చిత్రంగా 'సింగ్ గీతం' అనే సినిమాని తెరపైకి తీసుకొచ్చి ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఉదయగిరిలో 1931 సెప్టెంబరు 21న సింగీతం శ్రీనివాసరావు జన్మించారు. తండ్రి రామచంద్రరావు హెడ్‌మాస్టర్ కాగా తల్లి శకుంతలాబాయి వాయులీన విద్వాంసురాలు. తల్లి సంగీత నేపథ్యం ఆయనలో కూడా సంగీత అభిరుచిని పెంచింది. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో చదివేటప్పుడే నాటకరంగంలో ప్రవేశం ఏర్పడింది. ఈ క్రమంలోనే తొలిసారి స్కూల్లో లవకుశ నాటకంలో లవుని పాత్ర వేశారు. అదే సమయంలో టూరింగ్ టాకీస్‌లో చూసిన 'సీతా కల్యాణం', 'శ్రీకృష్ణ లీలలు' చిత్రాలు ఆయనపై బలమైన ముద్ర వేశాయి. ఉదయగిరిలో పదోతరగతి, గూడూరులో ఇంటర్ పూర్తి చేసిన సింగీతం.. ఆ తర్వాత యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో బీఎస్సీ ఫిజిక్స్ చేశారు. ఆ సమయంలో హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో నాటకరంగ ప్రవేశం చేశారు. ఆ రోజుల్లోనే హాలీవుడ్ సినిమాలు బాగా చూసేవారు. డిగ్రీకి వచ్చిన తర్వాత సూళ్లూరుపేటలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. స్వయంగా రచించిన నాటకాలను తన విద్యార్థులతో ప్రదర్శింపచేశారు. దిగ్గజ దర్శకుడు కె.వి.రెడ్డి వద్ద 'మాయాబజార్' (1957) లాంటి గొప్ప చిత్రానికి సహాయ దర్శకుడిగా తన సినీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు వద్ద శిష్యరికం చేసిన అనుభవమే ఆయనను అద్భుతమైన మ్యూజికల్ చిత్రాలు తీసేలా చేసింది.

**భార్యపై ప్రేమతో శ్రీకల్యాణీయం**

సింగీతం శ్రీనివాసరావుకు లక్ష్మీ కల్యాణితో 1960లో వివాహం జరిగింది. కథా చర్చల్లో పాలుపంచుకుంటూ తన సినిమా స్క్రిప్టులు రాయడంలో సహాయపడే ఆమెతో ఉన్న అమితమైన అనుబంధానికి గుర్తుగా.. 'శ్రీకల్యాణీయం' అనే ఆత్మకథను ఇద్దరూ రచించారు. ఆ పుస్తకాన్ని ఆయన కుమార్తెల్లో ఒకరైన సుధా కార్తీక్ ఆంగ్లంలోకి అనువదించగా సింగీతం మనవడు అభినవ్ విడుదల చేశారు. 2022 మే 28న లక్ష్మీ కల్యాణి అనారోగ్యంతో చెన్నైలో కన్నుమూశారు. కుమార్తెలు, మనవళ్లతో కలిసి చెన్నై సాలిగ్రామంలో ఆయన నివసించారు. చెన్నైలోనే అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. సింగీతం మృతిపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సామాజిక మాధ్యమాల ద్వారా సంతాపం తెలిపారు.

**రెండు జాతీయ పురస్కారాలు**

మాటలు లేని సినిమాతో ప్రేక్షకులను నవ్వించడం, ఏడిపించడం సాధ్యమేనా? అనే ప్రశ్నకు సమాధానంగా కమల్‌హాసన్ ప్రధాన పాత్రలో ఆయన తీసిన 'పుష్పక విమానం' (1987) భారతీయ చలనచిత్ర చరిత్రలో ఒక మైలురాయి. ఒక్క డైలాగ్ కూడా లేకుండా కేవలం హావభావాలు పలికిస్తూ, నేపథ్య సంగీతంతోనే అద్భుతమైన బ్లాక్ కామెడీని అందించి అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. రెండు జాతీయ పురస్కారాలతో పాటు ఐదు నంది అవార్డులను, పలు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలను అందుకున్నారు సింగీతం.

# గుర్తింపు లేదు

చేతుల మీదుగా, రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ శౌంఠి నాగరాజు గారి నాయకత్వంలో జిల్లా అధ్యక్షులు శ్రీరామూర్తి ఆధ్వర్యంలో జనసేనకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. జనసేన పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేసినప్పటికీ తమకు తగిన గుర్తింపు, గౌరవం, రాజకీయ అవకాశాలు దక్కలేదని చేరిన నాయకులు తెలిపారు. ముఖ్యంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీలో నెలకొన్న అంతర్గత వర్గపోరు కారణంగా తమ రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శౌంఠి నాగరాజు మాట్లాడుతూ, జనసేనలో సంవత్సరాల తరబడి పనిచేసిన నాయకులు తమ రాజకీయ అనుభవాన్ని, ప్రజలతో ఉన్న సంబంధాలను ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీతో కలపడం స్వాగతించదగ్గ పరిణామమని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి నాయకుడికి తగిన గౌరవం, బాధ్యతలు కల్పిస్తూ వారి రాజకీయ భవిష్యత్తుకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత విస్తృతంగా పోరాటాలు నిర్వహిస్తూ పార్టీకి బలమైన కేడర్‌ను నిర్మిస్తామని శౌంఠి నాగరాజు అన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి గారి నాయకత్వంపై నమ్మకంతో, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల పట్ల ఆకర్షితులై పలువురు నాయకులు కాంగ్రెస్ వైపు వస్తున్నారని ఆయన తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఇది కొత్త బలాన్ని అందిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు షేక్ చిన్న బాజీ, మొహమ్మద్ అహ్మద్, మహమ్మద్ బాజీ, అబ్దుల్ ఖాజా, షేక్ బాజీ హోలీ, మహమ్మద్ తాజుద్దీన్, నాడ మాధవరావు, పుప్పాల సాయిబాబు, బుర్ర చెన్నకేశవ, మహమ్మద్ హుస్సేన్, మహమ్మద్ హమీద్, షేక్ గౌస్, షేక్ కన్నా, అన్నిశెట్టి లక్ష్మణరావు, మహమ్మద్ దిలావర్ ఖాన్, అబ్దుల్ సలాం, పుల్లేటి సాయిబాబు, బి.ఆర్. రత్నాజీ, పఠాన్ హుస్సేన్ ఖాన్, చందోలు గోపికుమార్, పెద్ద సింగ్ బర్నీ బాస్, లంకలపల్లి మురళీకృష్ణ, నంగనం శ్రీనివాసరావు, బలగం వెంకటేశ్వరరావు, పొట్లూరి బాలారెడ్డి, బ్రహ్మం, సికినం దానేలు, అబ్దుల్ గఫూర్ తదితరులు ఉన్నారు. కృష్ణ జిల్లా లో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణకు ఈ చేరికలు నిదర్శనమని, రాబోయే రోజుల్లో మరింత మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని శౌంఠి నాగరాజు తెలిపారు.

# 'మాకు గర్వకారణం'..

పైలట్‌ను పరామర్శించాను. ఆయన మా బృందంలో, దేశ చరిత్రలో ఒక భాగం. యూఏఈ ఆశయాలకు ప్రతీకగా నిలవడం మాకు గర్వకారణం" అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

**మచ్చర్ భార్య హుందాతనం చాటుకున్నారు.. ఓ వైద్యురాలి పోస్టు**

ఇటీవల షైదుబాయ్ ఘటనలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ తీవ్ర గాయాలపాలైన సందర్భాన్ని ఆయన భార్య సోనల్ మాత్రం ఎంతో ప్రశాంతంగా, ధైర్యంగా ఎదుర్కొన్నారట. స్మిత్ కుటుంబం నివసిస్తున్న సొసైటీలోనే ఉంటున్న ఆర్తీ శర్మ అనే వైద్యురాలు ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "స్మిత్ మచ్చర్‌పై జరిగిన దాడి గురించి తెలియగానే మేమంతా ఆయన భార్యకు ధైర్యం చెబుతూ సందేశాలు పంపాం. అదేవిధంగా ఎలాంటి సాయం కావాలన్నా సిద్ధంగా ఉన్నామని తెలిపాం. ఇటువంటి క్లిష్టమైన సమయంలోనూ ఆమె ఎంతో సంయమనంతో, ప్రశాంతంగా స్పందించారు. తన భర్త క్షేమంగానే ఉన్నారని చెప్పారు. ఆ పరిస్థితుల్లోనూ హుందాతనాన్ని చాటుకున్నారు. మా చొరవకు కృతజ్ఞతలు తెలిపారు. మనం ఎప్పుడైతే ఒక వ్యక్తి ధైర్యసాహసాలను ప్రశంసిస్తామో.. వారి వెనుక ఒక కుటుంబం ఉంటుంది. ఆ వ్యక్తి క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని ఆశిస్తూ.. ఎదురుచూస్తుంటుంది" అని ఆర్తీ శర్మ పేర్కొన్నారు.

# బాలలకు భద్రత

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని ప్రభుత్వ శాఖలను ఆదేశించారు. హైకోర్టు, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలతో సంప్రదించి ఈ ప్రణాళికను రూపొందించాలన్నారు. సైబర్ నేరాల నుంచి పిల్లలను రక్షించడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉందన్నారు. అంతేగాకుండా పిల్లలు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు ప్రేమతో, ఆప్యాయతతో తెలుసుకుని మన పిల్లలను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. సైబర్‌స్పేస్‌లో పిల్లలకు న్యాయం అందించడం, ఆన్‌లైన్ భద్రత, రక్షణ వ్యవస్థలను సిద్ధం చేయడం అనే అంశాలపై హైదరాబాద్‌లో శనివారం ప్రారంభమైన జాతీయ న్యాయసేవాధికార సంస్థ దక్షిణ ప్రాంత సదస్సులో ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. "పిల్లలు ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఇంటర్నెట్‌లో చిన్నారులు ఏం చేస్తున్నారన్న విషయం చాలా మంది తల్లిదండ్రులకు తెలియడంలేదు. ఇంటర్నెట్, కృత్రిమ మేధతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. పిల్లలు అమాయకులు. ఏ ఆన్‌లైన్ సమాచారం నకిలీదో...ఏది వాస్తవమైనదో గుర్తించే పరిణితి వారికి ఉండదు. పిల్లలు తెలియక చేసే పొరపాట్ల వల్ల ఎదురయ్యే పరిణామాలు ఒక్కోసారి తీవ్రంగా ఉంటాయి. వాటివల్ల పిల్లలతో పాటు వారి కుటుంబాలు, సమాజానికి హాని కలగవచ్చు.

**మనముందు కీలక ప్రశ్నలు**

పిల్లలకు వ్యతిరేకంగా జరిగే సైబర్ నేరాలను ఎలా అడ్డుకోవాలి, వారికి రక్షణ ఎలా కల్పించాలి, న్యాయం ఎలా చేయాలన్నది మన ముందున్న కీలక ప్రశ్నలు. మహిళలు, పిల్లల రక్షణకు మా ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తోంది. ఇక్కడ చాలా మంచి సంస్థలున్నాయి. ఇందులో పోలీసు, భరోసా కేంద్రాలు, పిల్లల సంరక్షణ కేంద్రాలు, సంక్షేమ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయసేవాధికార సంస్థలు లాంటి వ్యవస్థలున్నాయి. అయితే ఇవన్నీ సమన్వయంతో పనిచేసి పిల్లల రక్షణకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. దేశంలోనే హైదరాబాద్‌లో మొదటి చైల్డ్‌ఫ్రెండ్లీ కోర్టు ఏర్పాటైంది. పాఠశాల విద్యాశాఖతో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకుని ఉపాధ్యాయులు, పిల్లల హక్కులపై అవగాహన కల్పిస్తోంది. ఇప్పటివరకు 3 వేల మంది పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చింది. న్యాయం చేయడం అంటే కేవలం నిందితులను శిక్షించడమే కాదు...బాధితుడి జీవితాన్ని పునరుద్ధరించడం, వారి బాల్యాన్ని వెనక్కి తెచ్చి గౌరవంగా నిలబెట్టడం. లీగల్‌సర్వీసెస్ అథారిటీ కార్యక్రమాలు ప్రతి జిల్లాకు, గ్రామానికి చేరాలి. ఈ కార్యక్రమాల్లో తల్లిదండ్రులనూ భాగస్వాములను చేయాలి. తల్లిదండ్రులు, పిల్లలు సైబర్ నేరాలపై 1930, చైల్డ్‌హెల్ప్ కోసం 1098 నంబర్‌ను గుర్తుంచుకోవాలి. రెండ్రోజులపాటు సదస్సులో జరిగే చర్చలు కేవలం రాష్ట్రానికే కాకుండా దేశానికి మార్గదర్శకంగా ఉంటాయని ఆశిస్తున్నా" అని సీఎం పేర్కొన్నారు.

**మొబైల్ లోక్‌అదాలత్ వ్యాన్‌ల ప్రారంభం**

లీగల్ సర్వీసెస్ ఏర్పాటు చేసిన మొబైల్ లోక్‌అదాలత్ వ్యాన్‌లను సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో కలిసి ప్రారంభించారు. 'న్యాయరథం - గడప ముంగిటకు న్యాయం' పేరుతో ఇవిసేవలందిస్తాయి.

**కమిట్‌మెంట్ వాల్ ఆవిష్కరణ**

పిల్లల భద్రత, గౌరవం, రక్షణ కల్పించడంలో భాగస్వాములందరి సమష్టి కృషి, సంకల్పానికి ప్రతీకగా నిలిచే 'కమిట్‌మెంట్ వాల్'ను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఒప్పంద కార్మికులకు న్యాయసేవలు కల్పించే పథకాన్ని కూడా సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఆర్.మహదేవన్, జస్టిస్ ఆలోక్ అరాధ్యట, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీకి లేదు

'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం దక్కకూడదనే ఉద్దేశంతోనే గతంలో వైసీపీ ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటాపై గతంలో కోర్టు తీర్పు ఇస్తే, దానిపై అప్పటి జగన్ ప్రభుత్వం ఎందుకు పోరాడలేదని ఆయన ప్రశ్నించారు. బీసీలకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సుప్రీంకోర్టులో పోరాటం చేస్తోందని తెలిపారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందే తెలుగుదేశం పార్టీ అని గుర్తుచేశారు. బీసీలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. టీడీపీకి బీసీలే వెన్నెముక అని, తమది బీసీల పార్టీ అని అన్నారు. జగన్ అండ్ కో ఆటలు ఇకపై చెల్లవని హెచ్చరించారు.

# రద్దు చేయాలి

పదవుల్లో ఉన్నట్లు భావించాలన్నారు. ఈవీఎంలను దుర్వినియోగం చేసి, గెలిచే ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధం కాదని ఆరోపించారు. ఖర్గే శనివారం కర్ణాటకలోని కలబురగిలో విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియ కూడా ఎన్నికల వ్యవస్థను మరింత దిగజార్చనుందన్నారు. గత నెల 30న నిర్వహించిన ఇండియా సమావేశంలో 20 పార్టీలు సర్ ప్రక్రియ పేదలు, నిరక్షరాస్యులు, అల్ప సంఖ్యాకులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ముక్తకంఠంతో చెప్పాయన్నారు. గతంలో ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలంటే ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, విపక్ష నేత, మంత్రులు సభ్యులుగా ఉన్న కమిటీ నిర్ణయించేదన్నారు. మోదీ ప్రభుత్వం ఈ కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి మంత్రులను చేర్చిందని దుయ్యబట్టారు. నిజాయతీపరులైన న్యాయమూర్తులుంటే తమ నిర్ణయాలను వ్యతిరేకిస్తారన్న భయం మోదీలో ఉందన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఇతర కమిషనర్లు ఏదైనా తప్పు చేసినా వారిని విచారించే అవకాశం లేకుండా చేశారని అసహనం వ్యక్తం చేశారు. సీఈసీలను గుప్పిట్లో పెట్టుకున్న ఎన్నికల వ్యవస్థతో ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారనిఆరోపించారు. ఈ అక్రమ ఎన్నికల విధానాలపై 6 నుంచి దిల్లీలో ఆందోళన చేపట్టబోతున్నట్లు ఖర్గే ప్రకటించారు.

# గడువు చెప్పలేం

ఆమె బంగ్లాదేశ్ ప్రధానిగానే ఉన్నారు. దీంతో మాకు ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. కొన్నిసార్లు ఊహించని పరిస్థితులు ఎదురవుతుంటాయి. ల్యాండింగ్‌కు అనుమతి ఇవ్వకుంటే పరిస్థితి ఎలా ఉండేదో నాకూ తెలియదు" అని త్రివేది తెలిపారు. ఆ సమయంలో బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులు.. ప్రపంచంలో మరెక్కడా పునరావృతం కాకూడదన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. 2024 ఆగస్టు 5న ఆ దేశం విడిచి భారత్‌కు వచ్చిన షేక్ హసీనా ఇక్కడే ఆశ్రయం పొందుతున్న విషయం తెలిసిందే. నిరసనలను అణచివేయడంలో హసీనా పాత్ర ఉందంటూ బంగ్లాదేశ్‌లో ఆమెపై అనేక కేసులు నమోదయ్యాయి. విచారణ జరిపిన బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్.. 2025లో ఆమెకు మరణశిక్ష విధించింది.

# మున్సిపల్ ఎన్నికలు

నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు. అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి.

# జాతి నిర్మాణకర్తలుగా భావిస్తున్నాం

నిలబెడుతోంది. మా టీమ్‌కు ఒక స్పష్టమైన విజన్ ఉంది. ఏ రంగమైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలి. నా దృష్టిలో పాన్ ఐఐటీ అంటే కంపెనీలు, టెక్నాలజీలు, పరిశోధనా సంస్థలు మొత్తం పరిశ్రమలను నిర్మించిన వ్యక్తులు. పాన్ ఐఐటీ 23 ఐఐటీల పూర్వ విద్యార్థులందరినీ ఒకచోట చేర్చుతుంది. భారతదేశం అంతటా, ప్రపంచ ప్రధాన టెక్నాలజీ హబ్ లలో 5 లక్షలకు పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలుపుతుంది. ఈ కమ్యూనిటీ మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో సమావేశం కావడం ఆనందంగా ఉంది.

**భారత్ అభివృద్ధికి దశాబ్దం చాలు**

అమెరికా, యూరప్ దేశాలు అభివృద్ధి చెందిన దేశాలుగా మారడానికి దాదాపు 100 సంవత్సరాలు పట్టింది. దుబాయ్ దాదాపు 30 సంవత్సరాల్లో, సింగపూర్ సుమారు 25 సంవత్సరాల్లో ఆ స్థాయికి చేరుకున్నాయి. భారత్ ఇప్పుడు ఒక కీలక దశలో ఉంది, అభివృద్ధి సాధించడానికి ఒక దశాబ్దం సరిపోతుందని నేను నమ్ముతున్నాను. ఆ 'గోల్డెన్ డికేడ్' మనదే కావాలి. దీనికి త్రీ "ఎస్" మంత్రమే ఆధారం. మొదటిది - స్పీడ్, రెండవది - సర్వీస్, మూడవది - స్టెబిలిటీ. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వేగాన్ని చూస్తే స్పీడ్ కు అర్థం తెలుస్తుంది. మా టీమ్ ఇప్పుడు ఆతృతతో ఉంది. ప్రజలు మాకు ఇచ్చింది ఐదు సంవత్సరాల సమయం. ఆ సమయంలోనే ఫలితాలు చూపించాలి. కేవలం ఎంఓయులు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే పని మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి, వాటి ద్వారా ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. రెండోది సర్వీస్. పరిశ్రమల అభివృద్ధిలో ప్రభుత్వానిది ఎంతో కీలకమైన పాత్ర ఉందని మేము నమ్ముతున్నాం. వ్యవస్థాపకులు, పరిశ్రమలను మేము 'జాతి నిర్మాణకర్తలు'గా భావిస్తున్నాం. మీతో కలిసి పనిచేయాలి, ప్రతి పాలసీని మీతో కలిసి రూపొందించాలి. ప్రపంచ స్థాయి పాలనను అందించాలి. అదే మా సేవా దృక్పథం. నిజానికి, రాష్ట్రంలోని టాప్ ప్రాజెక్టులపై వ్యక్తిగతంగా నేను శ్రద్ధ వహిస్తాను. ప్రతి శనివారం సాయంత్రం లేదా ఆదివారం ఉదయం ప్రమోటర్లకు వారి ప్రాజెక్టులపై వ్యక్తిగత అప్‌డేట్ పంపుతాను. ఆ సమయంలో వారు తమ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్ట్ గురించి చదివే సమయం ఉంటుంది. ఇదే ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ పెట్టుబడిదారులకు మేము అందిస్తున్న సేవ. మూడవది స్టెబిలిటీ. పాలసీ స్థిరత్వం, పాలసీ ఫ్రేమ్‌వర్క్ చాలా ముఖ్యమైనవి. పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకునేలా ఉండాలి.

**ఎంఓయులపై కాదు... అమలుపైనే దృష్టి**

నేను ఇప్పుడు చెప్పబోయే ఉదాహరణలు కేవలం ఎంఓయులు లేదా కాగితాలపై ఉన్న హామీలు కాదు. వాస్తవంగా అమలు జరుగుతున్న ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్నాను. మా ముఖ్యమంత్రికి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలనే విజన్ ఉంది. ఆయన ముఖేష్ అంబానీ గారిని ఒప్పించి రాయలసీమలోని మదనపల్లిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేయించారు. నిన్న దానికి శంకుస్థాపన చేశాం. ఇది హార్టికల్చర్ ఎకోసిస్టమ్‌లో దాదాపు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులను సాధిస్తుంది. పరిశోధన నుంచి ప్రాసెసింగ్ వరకు, మెకనైజేషన్ నుంచి వినియోగదారుడికి నాణ్యమైన ఉత్పత్తి అందించడం వరకు, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం వరకు మొత్తం వ్యవస్థను నిర్మించడమే లక్ష్యం. రెండవది స్టీల్ రంగం. గతంలో మనకు కేవలం రెండు స్టీల్ ప్లాంట్లు మాత్రమే ఉండేవి. ఇటీవల ఆర్సెలర్ మిట్టల్ 17 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌కు పునాది వేశాం. ఇతర రాష్ట్రాల్లో దాదాపు ఒక దశాబ్దం పాటు నిలిచిపోయిన ప్రాజెక్ట్ ఇది. నేను ఆదిత్య మిట్టల్‌తో మొదటి జూమ్ కాల్ చేసినప్పటి నుంచి పునాది వేసే దశకు పర్యావరణ అనుమతులతో సహా చేరుకోవడానికి కేవలం 17 నెలలు పట్టింది. ఇదే మా వేగానికి నిదర్శనం.

**ఏపీని ప్రపంచపటంలో నిలిపిన గూగుల్**

మూడోది డేటా సెంటర్ ఎకోసిస్టమ్. విశాఖపట్నంలో '+' అంటే గూగుల్ లోగో గుర్తొచ్చే స్థాయిలో అది విశాఖను ప్రపంచ పటంలో నిలబెట్టింది. గూగుల్ తో మొదటిసారి మాట్లాడినప్పుడు రెగ్యులేటరీ క్లారిటీ, పర్మినెంట్ ఎస్టాబ్లిష్ మెంట్, ట్యాక్సేషన్ వంటి అంశాలపై వారికి కొన్ని ప్రత్యేక విధానాలు అవసరమయ్యాయి. మేము కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ గారితో మాట్లాడి స్పష్టత తీసుకువచ్చాం. అలా కేవలం 13 నెలల్లో గూగుల్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్‌లో పునాది పడింది. మీరంతా నమో అంటే నరేంద్ర మోడీ అని అనుకుంటారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడి. ఎందుకంటే ఇక్కడ డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉంది. అందుకే ఇక్కడ పనులు వేగంగా జరుగుతున్నాయి.

**ప్రపంచానికి దిశానిర్దేశం స్థాయిలో ఎకోసిస్టమ్**

ఈరోజు మనం స్కైరూట్ గురించి మాట్లాడుతున్నాం. కానీ ఒక సంవత్సరం క్రితం చాలా మందికి ఆ ప్రాజెక్టు గురించి తెలియదు. మేం ఒక సంవత్సరం క్రితం వారిని సంప్రదించాం. కేబినెట్ ద్వారా వారికి 300 ఎకరాల భూమిని కేటాయించాం. దేశంలో ఎవరూ ఊహించని ధరకు భూమిని అందించాం. ఈ స్టార్టప్‌పై పెట్టుబడి పెట్టాల్సిన అవసరాన్ని నా కేబినెట్ సహచరులను ఒప్పించడానికి నాకు 30 నిమిషాలు పట్టింది. ఇలాంటి ధైర్యమైన నిర్ణయాలు తీసుకోవడానికి మేము సిద్ధంగా ఉన్నాం.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

# ఎడిటర్ వాయిస్

## "వై నాట్ పులివెందుల" కూటమి గర్జన, జగన్ హై అలర్ట్!

స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఏపీలో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ముఖ్యంగా గత స్థానిక ఎన్నికల్లో వైట్ వాష్ కు గురైన ప్రస్తుత అధికార కూటమి ఇప్పుడు విపక్షానికి అదే పరిస్థితి తీసుకురావాలని పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా వైనాట్ పులివెందుల అంటూ నినదించడమే కాకుండా, విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గంలో మెజార్టీ సీట్లను గెలుచుకునే వ్యూహంతో పనిచేస్తోందని చెబుతున్నారు. గతంలో జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, వైనాట్ 175, వై నాట్ కుప్పం అంటూ నినాదాలు చేసేవారు. ఇప్పుడు కూటమిలో ముఖ్యనేతలు ఆ విధమైన ప్రకటనలు చేయకపోయినా, పులివెందులలో జగన్మోహనరెడ్డికి ఓటమి రుచి చూపించాలనే లక్ష్యంతోనే అడుగులు వేస్తున్నట్లుగా సంకేతాలు పంపుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో ఇప్పటివరకు ఆయన కుటుంబానికి ఎదురులేకుండా పోయింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కూడా ఈ నియోజకవర్గంలో పోటీపై పెద్దగా దృష్టి పెట్టేవారు కాదని చెబుతున్నారు. జగన్మోహనరెడ్డి తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయాల్లోకి వచ్చిన నుంచి పులివెందుల నియోజకవర్గం ఆ కుటుంబానికి కంచుకోటగా ఉండగా, వైఎస్ ఆ తర్వాత జగన్ రెడ్డి చెప్పిన వారికే స్థానిక పదవులు దక్కేవి. అయితే గత ప్రభుత్వంలో జగన్మోహనరెడ్డి అనుసరించిన విధానాలు కారణంగా ప్రతిపక్ష నేతలకు బలమైన స్థానాల్లో కూడా ఆయా పార్టీలు పోటీ చేసే వాతావరణం లేకుండా పోయిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే ఎన్నికల్లో అలాంటి వాతావరణం లేకపోయినా ప్రజాస్వామ్యయుతంగానే పోరాడి వైసీపీని ఓడించాలని కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారని అంటున్నారు.

గత ఏడాది జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అనూహ్య విజయం సాధించగా, వైసీపీ అభ్యర్థికి కనీసం డిపాజిట్ రాలేదు. దీంతో గట్టిగా ప్రయత్నిస్తే పులివెందుల నియోజకవర్గంలో మెజార్టీ నియోజకవర్గాలను కైవసం చేసుకోవచ్చునని టీడీపీ కూటమి ప్లాన్ చేస్తోందని అంటున్నారు. ప్రధానంగా వైఎస్ ఫ్యామిలీకి తిరుగులేని బలం ఉన్న పులివెందుల నగర పంచాయతీలో పసుపు జెండా ఎగరవేయాలనే వ్యూహంతో టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికే వైసీపీలో ఉన్న కొందరితో చర్చలు సాగిస్తున్నారని కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కూడా స్వయంగా రంగంలోకి దిగినట్లుగా చెబుతున్నారు.

**జగన్ రెడ్డి ఫోకస్**

అధికార పార్టీ 'వై నాట్ పులివెందుల' అంటుండటంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అలర్ట్ అయ్యారని చెబుతున్నారు. ప్రతిపక్ష నేతల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న మాజీ సీఎం జగన్ రెడ్డి పార్టీ శ్రేణులు చేయిదాటిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కడప ఎంపీ అవినాశ్ రెడ్డికి దిశానిర్దేశం చేశారని అంటున్నారు. అదేసమయంలో ముఖ్యమైన కార్యకర్తలతో జగన్ రెడ్డి స్వయంగా మాట్లాడుతూ అధికార పార్టీ ప్రలోభాలకు లొంగవద్దని, తాను ఉన్నానని భరోసా ఇస్తున్నట్లు చెబుతున్నారు. ఇక జగన్ రెడ్డి సూచనలతో ఎంపీ అవినాశ్ రెడ్డితోపాటు ఇతర కుటుంబ సభ్యులు, వైసీపీ ముఖ్యనేతలు నియోజకవర్గంలో పట్టు సడలకుండా పకడ్బందీ వ్యూహరచన చేస్తున్నారని అంటున్నారు. దీంతో పులివెందుల రాజకీయం హాట్ హాట్ గా మారిందని చెబుతున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## విజయవాడలో ప్రేమోన్మాది ఘాతుకం



### ప్రియురాలిపై కత్తితో దాడి.. ఆపై ఆత్మహత్య

**గవర్నర్‌పేట, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడలో దారుణం చోటుచేసుకుంది. ప్రియురాలి మెడపై కత్తితో దాడి చేసి ప్రేమోన్మాది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువతి కూడా చికిత్స పొందుతూ మృతిచెందింది. నగరంలోని న్యూ రాజరాజేశ్వరిపేటలో ఈ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నారావు (22), మహాలక్ష్మి (19) గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. మహాలక్ష్మిపై అనుమానంతో శనివారం ఉదయం చిన్నారావు కత్తితో దాడి చేశాడు. మెడపై కోయడంతో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం చిన్నారావు డాబా పైనుంచి కిందికి దూకేశాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. యువతిని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బావిలో దూకి ఇద్దరు పిల్లలు సహా తల్లి ఆత్మహత్య

**పూడూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు పిల్లలతో కలిసి ఓ మహిళ బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మంచన్‌పల్లి అనుబంధ గ్రామం మాటుగూడకు చెందిన రాజు, మమత(30) భార్యాభర్తలు.. వారికి కుమార్తె జనశ్రీ (8), కుమారుడు సాకేత్(4) సంతానం. శుక్రవారం ఉదయం భార్యాభర్తలకు మధ్య గొడవ జరిగింది. దీంతో మమత తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. శనివారం ఉదయం సోమన్ గూర్తి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద చెప్పులు, బ్యాగు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బావిలో గాలింపు చర్యలు చేపట్టగా.. మమత, జనశ్రీ మృతదేహాలను లభ్యమయ్యాయి. ప్రస్తుతం సాకేత్ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఆరా తీస్తున్నారు.

## 43వ అంతస్తు నుంచి దూకేసిన యువకుడు

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఘోర ఘటన చోటుచేసుకుంది. 43వ అంతస్తు నుంచి దూకడంతో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. అంత ఎత్తు నుంచి పడటంతో ఆ వ్యక్తి శరీరం ఛిద్రమైందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నోయిడా సెక్టార్ 94లోని సూపర్‌నోవా సొసైటీలో ముందురోజు ఆ యువకుడు ఒక గదిని అద్దెకు తీసుకున్నాడు. శనివారం అతడు ఆ గదిని ఖాళీ చేయాల్సి ఉంది. కానీ, అతడు వెళ్లిపోకుండా 43వ అంతస్తు నుంచి దూకడంతో శరీరం ఛిద్రమై ప్రాణాలు కోల్పోయాడు. వ్యక్తిగత సమస్యల కారణంగా అతడు తీవ్ర వేదనకు గురైనట్లు తెలుస్తోందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. మృతుడు హరియాణాకు చెందినవాడని, ఈ తీవ్ర నిర్ణయం తీసుకోవడానికి ముందు అతడు తన తండ్రికి పలుమార్లు కాల్ చేశాడని పోలీసులు పేర్కొన్నారు.

అనంతగిరి ఘాట్ రోడ్డులో

## ట్రావెల్స్ బస్సు బోల్తా..

### నలుగురి మృతి



**వికారాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు మహిళలు మృతిచెందగా.. ఏడుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని కేసారం నుంచి వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం చింతకుంటకు 54 మంది ట్రావెల్స్ బస్సులో బయల్దేరారు. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వారంతా వెళ్లారు. ఈ క్రమంలో అనంతగిరి కొండ పైనుంచి కిందికి దిగే క్రమంలో ఘాట్ రోడ్డులో బస్సు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఘటనాస్థలాన్ని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి**

అనంతగిరి ఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## ఆలయ పూజారుల హత్య..

### మృతదేహాలకు నిప్పు

**షాజహాన్‌పూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాకు చెందిన ఓ ఆలయంలో నివసిస్తున్న వృద్ధ పూజారులు బిహారీదాస్ (60), గోపాల్‌దాస్ (70) గురువారం హత్యకు గురయ్యారు. వీరి మృతదేహాలకు నిప్పు పెట్టారు. ఆలయంపై ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్న సుమిత్‌సింగ్ ఈ దారుణానికి పాల్పడినట్లుగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్పీ సౌరభ్ దీక్షిత్ వెల్లడించారు. ఆగస్టు నెలలో జైలు నుంచి విడుదలైన సుమిత్‌సింగ్ ఆలయ నిర్వహణ బాధ్యతలను తన చేతుల్లోకి తీసుకునే వ్యూహంతో ఈ దుశ్చర్యకు పాల్పడినట్లుగా పోలీసులు తెలిపారు.



# రాయవరం వార సంత సమస్యలకు కొంత ఉపశమనం

## రూ.13.72 లక్షలతో షెడ్ నిర్మాణానికి భూమిపూజ

• చొరవ చూపిన గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవల్లి రాంబాబు








షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కూటమి నాయకులు


రహదారిపై వ్యాపారాలు.. ట్రాఫిక్ ఇబ్బందులు


శిథిలమైన షెడ్లు


పాడైన భవనాల్లో ఆక్రమణలు


పార్కింగ్ స్థలంగా మారిన సంత మార్కెట్..

**రాయవరం, అక్టోబర్ 3, విశ్వంవాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరంలో ప్రతి మంగళవారం నిర్వహించే వార సంత సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. చుట్టుపక్కల గ్రామాలైన లొల్ల, మహేంద్రవాడ, రామవరం, వెదురుపాక సావరం, వెదురుపాక తదితర ప్రజలతో పాటు ఆయా ప్రాంతాల్లోని ఇటుక బట్టీలు, ఇతర సంస్థల్లో పనిచేసే వలస కూలీలు సైతం ఈ సంతకు వచ్చి కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కరువై వ్యాపారులు, కొనుగోలుదారులు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ కోసం కేటాయించిన స్థలంలో నిర్మించిన షెడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వ్యాపారులు మండుటెండలోనూ, వర్షాల్లోనూ బహిరంగంగానే వ్యాపారాలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. మరోవైపు వ్యాపారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన షెడ్లు స్థానిక గృహాల వారి కార్ల పార్కింగ్‌కు ఉపయోగపడుతుండగా, మరికొందరు వలసదారులు అక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో మార్కెట్ స్థలం ఆక్రమణలకు గురవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో వ్యాపారులకు సరైన స్థలం లేక ఇరుకైన ప్రధాన రహదారిపైకి వ్యాపారాలు తీసుకువచ్చి నిర్వహిస్తుండటంతో కొనుగోలుదారులకు అసౌకర్యంతో పాటు ట్రాఫిక్ సమస్యలు సైతం తలెత్తుతున్నాయి. ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ మార్కెట్ అభివృద్ధిపై పూర్తిస్థాయిలో అధికారులు దృష్టి సారించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### కొత్త షెడ్డు నిర్మాణానికి ముందడుగు

ఈ నేపథ్యంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవల్లి రాంబాబు మార్కెట్ దుస్థితిని శాసనసభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి చర్చించడంతో పూర్తిగా శిథిలమైన ఓ షెడ్డును పునర్నిర్మించేందుకు రూ.13.72 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాడైన షెడ్డును పూర్తిగా తొలగించి నూతనంగా నిర్మించడంతో పాటు నేలపై కాంక్రీట్ పనులు చేపట్టనున్నారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి శనివారం స్థానిక కూటమి నాయకులతో కలిసి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవల్లి రాంబాబు భూమి పూజ కార్యక్రమం నిర్వహించి పనులను ప్రారంభించారు. మార్కెట్ దుస్థితిని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించడమే కాకుండా, పనుల ప్రారంభానికి చొరవ చూపిన రాంబాబు కృషిపై స్థానికంగా పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఒక షెడ్డుకు నిధులు మంజూరు కావడం కొంత ఉపశమనం కలిగించినా, మార్కెట్‌లో నెలకొన్న సమస్యలకు ఇది సంపూర్ణ పరిష్కారం కాదని పలువురు పేర్కొంటున్నారు. మిగిలిన షెడ్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు స్లాబ్ వేసి నిరుపయోగంగా వదిలేసిన భవనాలను ఆక్రమణల నుంచి విడిపించి, వాటిని సైతం వ్యాపార అవసరాలకు వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. అలాగే మార్కెట్ స్థలంలో ఆక్రమణలను తొలగించి, వ్యాపారులకు కేటాయించిన స్థలాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కెట్ అభివృద్ధికి తొలి అడుగుగా రూ.13.72 లక్షల నిధులతో షెడ్ నిర్మాణ పనులు ప్రారంభం కావడం శుభ పరిణామం గా, మిగిలిన షెడ్ల మరమ్మతులు, ఆక్రమణల తొలగింపు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారిస్తే రాయవరం వార సంతకు పూర్వవైభవం చేకూరడంతో పాటు వ్యాపారులకు, కొనుగోలుదారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

# విద్యార్థులకు ఉచిత నేత్ర పరీక్షలు.. ఐదుగురికి కళ్లజోళ్ల పంపిణీ

**రాయవరం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కిరణ్ నేత్ర వైద్య ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు నేత్ర వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలను గుర్తించారు. విద్యార్థులు చదువుకునే సమయంలో కంటి చూపు సమస్యలతో ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కంటి చూపు లోపం ఉన్న విద్యార్థులకు అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన ఐదుగురు విద్యార్థులకు ఆసుపత్రి సిబ్బంది ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. విద్యార్థులు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కంటి సమస్యలు ఎదురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్ నేత్ర వైద్య ఆసుపత్రి



సిబ్బందితో పాటు కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ దాడులు



**అమలాపురం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం ఈతకోట టోల్ ప్లాజా వద్ద 20 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన 8 బస్సులను గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు మొత్తం రూ.16 వేల అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతకు విఘాతం కలిగించే విధంగా డ్రైవర్లు, బస్సుల నిర్వాహకులు ఎలాంటి నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినా ఉపేక్షించబోమని తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు ఓలేటి శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, సురేష్ కుమార్, షణ్ముఖ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గుమ్ములూరు ఎస్సీ సామాజిక వర్గీయులు జనసేనలో చేరిక

## కండువా కప్పి పార్టీలోకి స్వాగతించిన బత్తుల



**కోరుకొండ, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని గుమ్ములూరు గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ సామాజిక వర్గీయులు పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై జనసేన పార్టీలో చేరారని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. శనివారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో గుమ్ములూరు గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ సామాజిక వర్గీయులు వైసిపి నుండి జనసేన పార్టీలోకి విచ్చేసారని, వారికి రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ జనసేన పార్టీ కండువా కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి పెద్ద ఎత్తున జనసేన పార్టీలోకి విచ్చేస్తున్నారని, దీంతో నియోజకవర్గంలో వైసీపీకి పతనం తప్పదన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధి,ఆయన ఆశయాలకు ఆకర్షితులై పార్టీలోకి విచ్చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా మండలంలోని గుమ్ములూరు గ్రామానికి చెందిన వైసిపి మాజీ వార్డు మెంబర్లు, గ్రామ ప్రముఖులు, వివిధ కులాల పెద్దలు బత్తుల సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ,అడపా శ్రీనివాస్,కాటే కృష్ణప్రసాద్,గుమ్ములూరు గ్రామస్తులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# గోలి బులి రాజుకు స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్ అవార్డు



**సీతానగరం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం మునికూడలి గ్రామ పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న గోలి బులి రాజు స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్,జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా ఈ అవార్డును బహుకరించడం జరిగింది. మునికూడలి గ్రామ పంచాయతీకి స్వచ్ఛ సోక్ ఫిట్ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని పంచాయతీ సిబ్బంది సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# రాయవరంలో ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రికి శ్రీకారం

## రూ.1.93 కోట్లతో నూతన భవన నిర్మాణం.. శంఖుస్థాపన చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల



**రాయవరం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గ్రామంలో నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి శనివారం శంఖుస్థాపన నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.93 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ నిర్మాణ పనులకు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ అనిరుధ్ తో కలిసి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. గతంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అదే ప్రాంతంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆధునిక వసతులతో ఆసుపత్రి భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రాయవరం పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆయన పేర్కొన్నారు. నూతన ఆసుపత్రి నిర్మాణంతో వైద్య సదుపాయాలు మరింత అందుబాటులోకి వస్తాయని పలువురు సంతోషం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉండవల్లి రాంబాబు, వల్లూరి శ్రీనివాస్, చల్లా సత్యనారాయణ, బర్ల రాజు, నేతల సురేష్, కందుకూరి గంగరాజు, ఇందుగుమిల్లి అరుణ్ కుమార్, జనసేన నాయకులు దేవిశెట్టి కోటేశ్వరరావు, బేరా దుర్గా ప్రసాద్, తూము చక్రధరరావు, పట్నాల జగదీష్, ఆసుపత్రి సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.










# స్వచ్ఛ ఆంధ్ర అవార్డు గ్రహీత "వాసంశెట్టి సత్యం"కు ఘన సత్కారం




**రామచంద్రపురం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఎన్జీవో గా స్వచ్ఛ ఆంధ్ర -2026 అవార్డు అందుకున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంను రామచంద్రపురం పట్టణ ప్రముఖులు, పలు గ్రామాల నాయకులు, ప్రజలు ఈరోజు ఘనంగా సత్కరించారు. రామచంద్రపురం నియోజవర్గంలోని మంజేరు, శీల, శీలంక, ఒంటితాడి, వెల్ల గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలు వాసంశెట్టి సత్యంను మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా, మంత్రి వాసంశెట్టి సుభాష్ సహకారంతో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఒకపక్క సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా, మరోపక్క మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రభుత్వ పరంగానే కాకుండా, వ్యక్తిగతంగా, సి ఎస్ ఆర్ నిధులు తీసుకువచ్చి నియోజకవర్గానికి చేస్తున్న సేవలు ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరన్నారు. ఈ కార్యక్రమంలో జల్లి సత్యనారాయణ, దడాల నాగార్జున, కాజులూరు మండలం జనసేన యువత అధ్యక్షులు కూనపరెడ్డి శివకృష్ణ, గుండారపు శ్రీనివాస్, ఆకుల నారాయణరావు,కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

### రామచంద్రపురం పట్టణంలోనూ సంబరాలు

రామచంద్రపురంలోని పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, కట్టా నాగేశ్వరరావు, కంచుమర్తి బాబురావు, వాసంశెట్టి బాలా, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు ఫణి తేజ, చింతాకుల ప్రకాష్, 28వార్డు ప్రెసిడెంట్ చంటి, 25వ వార్డు ప్రెసిడెంట్ అంగర శీను, కవల నానాజీ, గడి జగన్,గడి గోవిందు, బల్ల శివ, కూటమి కార్యకర్తలు అవార్డు గ్రహీతను సత్కరించారు. కేకు కోసి వాసంశెట్టి సత్యంకు శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఫౌండేషన్ ద్వారా మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటామని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

### మోడరన్ హైస్కూల్‌లో

# ఆకట్టుకున్న రోబోటిక్స్ శిక్షణా కార్యక్రమం



**రామచంద్రపురం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలో ఎస్.ఎం.డి.జి.ఎం.డి. మోడరన్ హైస్కూల్‌లో చుక్కారామయ్య స్పేస్ ప్రోగ్రాం అభ్యసిస్తున్న 90 మంది విద్యార్థులకు వారం రోజులపాటు మోడరన్ విద్యా సంస్థల ప్రాంగణంలో స్మార్ విక్స్ టెక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ బేస్డ్ రోబోటిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ కోఆర్డినేటర్స్ పావులూరి సత్యరాజసాయి, కుడిపూడి రంజిత్ కుమార్ విద్యార్థులకు ఆసక్తికరంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ ప్రాధాన్యతను వివరించారు. రానున్న రోజుల్లో రోబోట్స్ యొక్క పాత్రను విద్యార్థులకు అర్థమయ్యేలా విశ్లేషించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో ప్రదర్శించిన నమూనా రోబోట్ల ప్రదర్శన విద్యార్థులను అమితంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు మాట్లాడుతూ... రేపటి భవిష్యత్తును ప్రతిబింబింపజేసే శాస్త్రీయ అంశాలను ఈరోజే తరగతి గదుల్లో బోధించాలనే కాన్సెప్ట్ తో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం హైస్కూల్ అకాడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించేలా, అలాగే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ పట్ల అవగాహన కలిగించేలా ఈ తరహా క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సత్యరాజ్ సాయి, రంజిత్ కుమార్‌లను అధినేత జి. వి రావు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ముత్యాల చిట్టిబాబు కోఆర్డినేటర్ వై.రాజు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బందికి బీమా, పెన్షన్ పథకాలపై అవగాహన




**అమలాపురం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది, అధికారులకు వివిధ బీమా, పెన్షన్ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, జాతీయ పెన్షన్ వ్యవస్థ రెండో శ్రేణి ఖాతా, ఆరోగ్య బీమా పథకాలపై బ్యాంకు అధికారులు పోలీస్ సిబ్బందికి వివరించారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద ఏ కారణంతోనైనా మరణిస్తే రూ.2 లక్షల జీవిత బీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. ఈ పథకానికి వార్షిక ప్రీమియం రూ.436 కాగా, జూన్ 1 నుంచి మే 31 వరకు బీమా కాలపరిమితి ఉంటుందని వివరించారు. 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల వారు ఈ పథకంలో చేరవచ్చని, బీమా రక్షణ 55 సంవత్సరాల వయస్సు వరకు కొనసాగుతుందని తెలిపారు. బ్యాంకు లేదా పోస్టాఫీసులో పొదుపు ఖాతా ఉండటంతో పాటు ఆధార్‌తో అనుసంధానం చేయాల్సి ఉంటుందని వివరించారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద సంవత్సరానికి కేవలం రూ.20 ప్రీమియంతో ప్రమాద బీమా రక్షణ పొందవచ్చని తెలిపారు. 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల భారతీయ పౌరులు ఈ పథకానికి అర్హులని చెప్పారు. ప్రమాదంలో మరణం లేదా శాశ్వత పూర్తి వైకల్యం సంభవిస్తే రూ.2 లక్షలు, శాశ్వత పాక్షిక వైకల్యం సంభవిస్తే రూ.1 లక్ష బీమా ప్రయోజనం లభిస్తుందని వివరించారు. ప్రీమియం బ్యాంకు ఖాతా నుంచి స్వయంచాలకంగా మినహాయించబడుతుందని తెలిపారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల భారతీయ పౌరులు చేరవచ్చని, 60 సంవత్సరాల వయస్సు తర్వాత చందా మొత్తాన్ని బట్టి నెలకు రూ.1,000 నుంచి రూ.5,000 వరకు హామీతో కూడిన పింఛను పొందవచ్చని తెలిపారు. చందాదారు మరణించిన అనంతరం జీవిత భాగస్వామికి పింఛను కొనసాగుతుందని, ఇద్దరూ మరణించిన తర్వాత నామినీకి జమ అయిన మొత్తం అందుతుందని వివరించారు. జాతీయ పెన్షన్ వ్యవస్థ రెండో శ్రేణి ఖాతా స్వచ్ఛందంగా పొదుపు చేసుకునేందుకు ఉపయోగపడుతుందని, మొదటి శ్రేణి ఖాతా ఉన్నవారు మాత్రమే దీనిని తెరవగలరని తెలిపారు. ఇందులో ఎప్పుడైనా నగదు ఉపసంహరించుకునే అవకాశం ఉంటుందని, సాధారణ పౌరులకు పన్ను మినహాయింపు ఉండదని వివరించారు. మొదటిసారి లేదా ప్రతి చందాకు కనీసం రూ.250 జమ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆరోగ్య బీమా ద్వారా వైద్య, ఆసుపత్రి ఖర్చుల నుంచి ఆర్థిక రక్షణ పొందవచ్చని బ్యాంకు అధికారులు వివరించారు. వ్యక్తిగత ఆరోగ్య బీమా, కుటుంబ ఆరోగ్య బీమా, తీవ్రమైన అనారోగ్యాలకు సంబంధించిన బీమా పథకాల గురించి వివరించారు. ఆసుపత్రి ఖర్చులు, గది అద్దె, వైద్యుల ఫీజులు తదితర ఖర్చులకు బీమా రక్షణ లభిస్తుందని, అర్హత ఉన్న ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవల సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ, అమలాపురం డీఎస్పీ, ఏఆర్ డీఎస్పీ, ఆర్ఐ వెల్ఫేర్, అమలాపురం టౌన్ సీఐ, అమలాపురం సబ్ డివిజన్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ద్రాక్షారామ విద్యార్థిని ఎంపిక



**ద్రాక్షారామ, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన గర్ల్స్ అండర్-14 రగ్బీ క్రీడా ఎంపికలలో ద్రాక్షారామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ప్లస్) 8వ తరగతి విద్యార్థిని షేక్ కరీమున్నిసా బేగం జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో ఆమె పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయులు పెరిచర్ల శేఖర్ తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఎస్ఎంసీ చైర్మన్ షేక్ జామిల మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతం నుండి రగ్బీ వంటి ప్రతిష్టాత్మక క్రీడలో విద్యార్థిని విశేష ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణం అన్నారు. విద్యార్థినికి మెరుగైన శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయులకు, ప్రోత్సహించిన ఉపాధ్యాయ బృందానికి మరియు తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఎంసీ వైస్ చైర్మన్ పెయ్యాల రాంబాబు మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయికి కూడా ఎంపికకావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ఆరవ విస్సు, సీనియర్ ఉపాధ్యాయులు మూర్తి, ఖాజా మొహిద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆని శ్రీనివాస్, ఏ. ఉమ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రూ.15.27 లక్షలతో రామచంద్రపురం పట్టణంలో

# అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

### మంత్రి సుభాష్ కృషితో వేగవంతంగా నియోజకవర్గ అభివృద్ధి
### కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలో వివిధ వార్డుల్లో రూ.15.27 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేయడం జరుగుతోందన్నారు. రహదారులు, డ్రైనేజీలు, పారిశుధ్య సదుపాయాల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మంత్రి సుభాష్ నాయకత్వంలో ఇప్పటికే రామచంద్రపురం పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం మరో విడతలో పలు వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

### వార్డుల వారీగా అభివృద్ధి పనులు

16వ వార్డు - చప్పిడివారి సవరం
డి.నెం. 32-2-11 నుండి 32-2-9/21 వరకు సీసీ రోడ్డు నిర్మాణం -2.35 లక్షలు
అదే ప్రాంతంలో సీసీ డ్రైన్ నిర్మాణం -0.41 లక్షలు.
13వ వార్డు - బ్రాడిపేట-2 సచివాలయం పరిధి
డి.నెం. 31-2-28/21 నుండి 31-2-8/39 వరకు సీసీ రోడ్డు -2.94 లక్షలు.
అదే ప్రాంతంలో సీసీ డ్రైన్ - 0.23 లక్షలు.
11వ వార్డు - పైడారావు వీధి
డి.నెం. 31-2-5/7 నుండి 31-3-6 వరకు సీసీ రోడ్డు -- 1.64 లక్షలు.
అదే ప్రాంతంలో సీసీ డ్రైన్ - 0.81 లక్షలు.
3వ వార్డు - అంకంవారి వీధి
డి.నెం. 14-2-61/6 నుండి జెట్టి రాము ఇంటి వరకు సీసీ రోడ్డు -1.97 లక్షలు.
అదే ప్రాంతంలో సీసీ డ్రైన్ - 1.08 లక్షలు.
1వ వార్డు - కొత్తూరు
కమ్యూనిటీ టాయిలెట్స్ నుండి సాయిబాబా ఆలయం వరకు సీసీ డ్రైన్ నిర్మాణం (రూడా గ్రాంట్) - 3.84 లక్షలు.
15వ ఆర్థిక సంఘం, రూడా గ్రాంట్‌తో మొత్తం అభివృద్ధి పనుల విలువ : 15.27 లక్షలు.

ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్లు మాట్లాడుతూ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిరంతరం ప్రజల అవసరాలను గుర్తించి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు కూడా ఈ అభివృద్ధిని గమనించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ శ్రీకాంత్, ఏ ఈ సునీల్, కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, ఆయా వార్డుల నాయకులు, పెద్దలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 24 గంటల్లోనే కదిలిన ఇరిగేషన్ యంత్రాంగం

### జనుపల్లి, నల్లమిల్లి రైతుల సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన



**అమలాపురం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల కురిసిన వర్షాలకు జనుపల్లి, నల్లమిల్లి ప్రాంతాల్లో పంట పొలాలు నీటమునిగిన విషయంపై అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్పందించారు. రైతుల సమస్యలను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు ఫోన్ చేసి వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ అధికారులు శనివారం జనుపల్లి, నల్లమిల్లి ప్రాంతాల్లో పర్యటించి డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. ఇరిగేషన్ ఎస్ఈ, డీఈలు అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అమూడా) చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, స్థానిక రైతు సంఘం అధ్యక్షుడు మట్టా ప్రభాకర్‌తో కలిసి పంట పొలాలను, నడిపూడి రోడ్డులోని మురుగు కాలువను పరిశీలించారు. నడిపూడి రోడ్డులోని మురుగు కాలువ వద్ద గతంలో నిర్మించిన వంతెనను అధికారులు నిశితంగా పరిశీలించారు. పాత వంతెనకు కొత్త వంతెనను అనుసంధానం చేసే విధానం సక్రమంగా లేకపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్నట్లు గుర్తించారు. వంతెన వద్ద ఎత్తుపల్లాలు సరిగా లేకపోవడంతో డ్రైన్‌లో కొట్టుకొచ్చే చెత్తాచెదారం అక్కడ పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో నీరు వెనక్కి తన్ని జనుపల్లి, నల్లమిల్లి పరిధిలోని వందలాది ఎకరాల పంట పొలాలు నీటమునిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. జనుపల్లితో పాటు నల్లమిల్లిలోని నల్లచెరువు పరిధిలోని పంట పొలాల్లో నిలిచిన నీరు ప్రధాన మురుగు కాలువలోకి సులభంగా వెళ్లేలా నూతన కల్వర్టు నిర్మించాలని రైతులు, అమూడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు అధికారులను కోరారు. దీనిపై స్పందించిన ఇరిగేషన్ అధికారులు నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను తక్షణమే తొలగించే చర్యలు చేపడతామని తెలిపారు. రైతులు కోరిన కల్వర్టు నిర్మాణంతో పాటు వంతెన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన అంచనాలను సిద్ధం చేసి ఎమ్మెల్యేకు సమర్పిస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే ఆనందరావు చొరవతో తమ సమస్యపై 24 గంటల్లోనే ఇరిగేషన్ అధికారులు స్పందించి క్షేత్రస్థాయికి రావడంపై జనుపల్లి, నల్లమిల్లి రైతులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన నిర్మాణ లోపాలను సరిదిద్ది తమకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వానికి, ఎమ్మెల్యే ఆనందరావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఇరిగేషన్ అధికారులు, వాకపల్లి నాయుడు, గోకరకొండ వాసు, బండారు రాము, నల్లా వెంకటేశ్వరరావు, సుదా చిన్నా, చింతపల్లి చిన్నా, బూరగాయల శివ తదితరులు పాల్గొన్నారు.

# పొడగట్లపల్లిలో పులవర్తి గోపాలకృష్ణ జన్మదిన వేడుకలు



**రావులపాలెం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో సమాజ సేవలో ముందుండి పేద విద్యార్థులకు సహాయం చేస్తూ విద్యాబుద్ధులు నేర్పిస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ తన వంతుగా ఏదో ఒకటి మంచి పనిచేయాలని మంచి పనులు చేసుకుంటూ గ్రామ మహిళలకు జానపద కళలు కోలాటం సంగీతం సాంస్కృతిక కార్యక్రమాలలో తర్ఫీది ఇప్పిస్తూ పిల్లలకు భరతనాట్యం నేర్పిస్తూ తన వంతుగా ఏదో ఒక సేవ ప్రజలకు చేయాలనే తపనతో ప్రతిక్షణం ఆలోచిస్తూ ప్రజా సేవకులుముందుండే పులవర్తి గోపాలకృష్ణ వారి జన్మదినం అక్టోబర్ 2 కావడంతోఎంతో ఆహ్లాదకరంగా అభిమానులు మహిళలు చిన్నారుల సమక్షంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అంగరంగ వైభవంగా జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు అభిమానులు పాల్గొన్నారు.

# పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు, ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు బహూకరణ



**అమలాపురం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** కొమరగిరిపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు సీలింగ్ ఫ్యాన్లు, ఆరు ఎల్ఈడీ ట్యూబ్ లైట్లను బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాల సత్యనారాయణ సమక్షంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కాకినాడలోని చేయూత స్వచ్ఛంద సంస్థ నుంచి అవార్డు, అక్టోబర్ 2న కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా సాస్ అవార్డు అందుకున్న సందర్భంగా సాల సత్యనారాయణను రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, మోసుగంటి గంగయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాల సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు చిట్టుమేను వెంకటేశ్వరరావు, మోసుగంటి వెంకటేశ్వరరావు, రుద్రరాజు రమేష్ రాజు, ఉపాధ్యాయులు పద్మావతి, శివజ్యోతి, అడబాల శ్రీనివాస్, ఎ. సుబ్రహ్మణ్యం, వై. ప్రభాకర్, సతీష్, విజయకుమార్, మణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి కరాటే ఎంపికల్లో అమలాపురం బాలికల ప్రతిభ



**పిఠాపురం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్‌జీఎఫ్ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే ఎంపికల్లో అమలాపురానికి చెందిన బాలికలు సత్తా చాటారు. పిఠాపురంలోని ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో అమలాపురానికి చెందిన బోలిశెట్టి యశస్విని అండర్-19 బాలికల 56 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచి విజయం సాధించింది. అదే విధంగా అండర్-19 బాలికల 63 కిలోల విభాగంలో రాకుర్తి ధరణి శ్రీమానిక్య విజయం సాధించి తన ప్రతిభను చాటింది. జిల్లా స్థాయి ఎంపికల్లో విజేతలుగా నిలిచి తదుపరి స్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు. చిన్న వయసులోనే కరాటేలో శిక్షణ పొందుతూ క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తున్న ఈ బాలికలు జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించడం విశేషంగా నిలిచింది. పవర్‌కిక్ షోటోకాన్ కరాటే డూ కోచ్ పడాల అంజి ఆధ్వర్యంలో వీరు క్రమం తప్పకుండా శిక్షణ పొందుతున్నారు. పోటీలకు ముందు ప్రత్యేకంగా సాధన చేయడంతో పాటు కరాటేలో మెళకువలు, శారీరక దృఢత్వం, పోటీ స్ఫూర్తి పెంపొందించుకునేలా కోచ్ మార్గదర్శకత్వం అందించారు. అమలాపురానికి చెందిన ఇద్దరు క్రీడాకారిణులు జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ ఎంపికల్లో విజయం సాధించడం పట్ల వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు, కోచ్, క్రీడా శిక్షకులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. కరాటేలో బాలికలు చూపుతున్న ప్రతిభ ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ - జనసేనలో భారీగా చేరికలు - నూతన ఉత్సాహంతో జనసేన కార్యకర్తలు**

**యనమల కృష్ణుడు రాకతో బలోపేతం దిశగా తుని నియోజకవర్గ జనసేన పార్టీ**





**కోటనందూరు, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కాకినాడ పార్లమెంటు సభ్యుడు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం తుని సాయి వేదిక ఫంక్షన్ హాల్ లో తుని జనసేన పార్టీ నాయకుడు యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అందుకు అనుగుణంగా పార్టీ బలోపేతంపై నాయకులు కార్యకర్తలు, కష్టించి పనిచేయాలన్నారు. ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా జనసేన పార్టీ అండగా ఉంటుందని అన్నారు. తుని, తొండంగి మండలాలు తుని పట్టణము నుండి వివిధ పార్టీల కార్యకర్తలు సుమారు 1500 మంది యనమల కృష్ణుడు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ మరియు కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు తుమ్మల బాబు కలిసి చేరిన కార్యకర్తలకు జనసేన కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు తుమ్మల బాబు మాట్లాడుతూ సీనియర్ నాయకులు యనమల కృష్ణుడు సారధ్యంలో తుని నియోజకవర్గ జనసేన పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేస్తుందని ఆయన అన్నారు. యనమల కృష్ణుడు జనసేన పార్టీలో చేరడంతో తుని నియోజకవర్గంలో జనసేన పార్టీకి మరింత రాజకీయ బలం చేకూరిందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

**కార్యకర్తలకు అండగా.....**

తుని నియోజకవర్గంలో జనసేన కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా ఎప్పుడు అండగా ఉంటానని ప్రజా సమస్యలపై పోరాడుతానని కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తానని గ్రామస్థాయి నుండి పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఈ సందర్భంగా యనమల కృష్ణుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుని నియోజకవర్గంలో ఉన్న కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై వైఎస్సార్సీపీ కుట్ర



**కాకినాడ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా**

**కాకినాడ, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి కుదిస్తూ హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ వెనుక ప్రతిపక్ష వైఎస్సార్సీపీ కుట్ర ఉందని కాకినాడ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు జరిగిన అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేశారు.

**బీసీలకు రాజకీయ జన్మనిచ్చింది టీడీపీయే..**

నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) పార్టీ స్థాపించిన నాటి నుంచి రాజకీయంగా ఎలాంటి గుర్తింపు లేని బీసీలకు పెద్దపీట వేసి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా అవకాశాలు కల్పించారని శ్రీనివాస్ బాబా గుర్తుచేశారు. 1987లో స్థానిక సంస్థల్లో బీసీలకు ఎన్టీఆర్ తొలిసారిగా 20% రిజర్వేషన్లు కల్పిస్తే, ఆ తర్వాత 1995లో ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు ఆ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి అమలు చేశారని వివరించారు.

**కోర్టు కేసులతో అడ్డుకున్న వైఎస్సార్సీపీ..**

1992లో సుప్రీంకోర్టు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని తీర్పు ఇచ్చినప్పటికీ, అప్పట్లో ఉన్న ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఈ రిజర్వేషన్లను అడ్డుకోలేదని ఆయన తెలిపారు. కానీ 2026లో వైఎస్సార్సీపీ ఉద్దేశపూర్వకంగానే తమ అనుకూల వ్యక్తులతో కోర్టులో కేసులు వేయించి బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారని ఆరోపించారు. గత ప్రభుత్వం వలంటీర్ల ద్వారా సీక్రెట్‌గా కులాల సర్వే చేయించి, ఆ డేటాను కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుందే తప్ప కోర్టులో బీసీల పక్షాన నిలబడలేదని విమర్శించారు. అలాగే, 'ఆదరణ 2' పథకం కింద బీసీలకు పనిముట్లు పంపిణీ చేయకుండా వందల కోట్లు వృథా చేశారని, గోదాముల్లో ఆ వస్తువులన్నీ తుప్పు పట్టిపోయాయని మండిపడ్డారు.

**త్వరలో 90% సబ్సిడీతో 'ఆదరణ 3'..**

ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీల హక్కుల సాధన కోసం రాజీవ్ మిశ్రా నేతృత్వంలో ఒక కమిటీని వేసిందని తెలిపారు. ఫ్యామిలీ సర్వే ద్వారా రాష్ట్రంలో బీసీల జనాభా 50.42% ఉందని తేల్చి ఆ వివరాలను కోర్టులకు సమర్పించిందని వెల్లడించారు. రాబోయే రెండు మూడు నెలల్లోనే బీసీల కోసం 90% సబ్సిడీతో 'ఆదరణ 3' పథకాన్ని భారీ బడ్జెట్‌తో అమలు చేయబోతున్నామని స్పష్టం చేశారు.

**బీసీలను మోసం చేసిన గత ప్రభుత్వం: వనపర్తి బద్రి**

ఈ సమావేశం రాష్ట్ర పెరిక కార్పొరేషన్ అధ్యక్షుడు వనపర్తి బద్రి మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుందని, కోర్టు కేసుల పేరుతో వారి హక్కులను కాలరాసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర పెరిక కార్పొరేషన్ అధ్యక్షుడు వనపర్తి బద్రి, మాజీ జెడ్పీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు, కరప మండలం టీడీపీ మాజీ ప్రధాన కార్యదర్శి సంఘాని బాల మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ గెదెల సత్తిబాబు, కాకినాడ రూరల్ మండల ట్రేడ్ యూనిట్ అధ్యక్షులు కొప్పిశెట్టి నాగబాబు, కాకినాడ రూరల్ బీసీ సెల్ అధికార ప్రతినిధి చెల్లుబోయిన ప్రకాష్, టీడీపీ సీనియర్ నాయకులు గొమ్మిడి తాతారావు, గొంతు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు..

**బీసీలకు 34 శాతం రిజర్వేషన్లుకు**

## తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే యనమల దివ్య



**కోటనందూరు, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** బీసీలకు రాజ్యాధికారం కల్పించాలన్న లక్ష్యంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లకు తెలుగు దేశం పార్టీ కట్టుబడి ఉందని ప్రభుత్వ విఫ్ తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేసారు. బీసీల రాజకీయ ప్రయోజనాలకు మోకాలడ్డిన వైకాపా నేతలు 34శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వ జారీ చేసిన జీవో నెం.105, మరియు 1065 జారీ చేస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని ఆమె ఆరోపించారు. ఇవాళ కాకినాడ జిల్లా, తుని మండలం, తేటగుంట క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే యనమల దివ్య మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు దక్కకూడదన్న గొడ్డలి పార్టీ దుర్బుద్ధి బయట పడిందన్నారు.34శాతం రిజర్వేషన్ల ప్రభుత్వ సంకల్పం మారబోదని బీసీలకు న్యాయం చేసేందుకు సుప్రీంకోర్టు కోర్టుకు వెళ్ళాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఆమె స్వాగతించారు.న్యాయపరమైన ప్రతి అంశాన్ని ఉపయోగించి బీసీలకు న్యాయం చేయాలని ప్రభుత్వ దృఢ సంకల్పంతో ఉందని యనమల దివ్య పేర్కొన్నారు. 34శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే స్థానిక సంస్థల్లో 16,800 మంది పదవులు కోల్పోవల్సిన పరిస్థితులు ఏర్పడతాయని ఆమె ఆందోళన వెలిబుచ్చారు.బీసీల అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా చేయాలన్న ఏకైక అజెండాతో గొడ్డలి పార్టీ బీసీలకు ద్రోహం చేస్తుందని ఆమె తూర్పారబట్టారు. సమాజంలో సగభాగాన్ని పైగా ఉన్న బీసీలకు ఆనాడు ఎన్టీఆర్, ఈనాడు చంద్రబాబు వెన్నుదన్నుగా నిలిచి ఆర్థిక స్వావలంబన, రాజకీయ ప్రొత్సహించిన ఘనమైన చరిత్ర తెలుగు దేశం పార్టీకి ఉందన్నారు. 1987లో 20శాతం 1995లో 34శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీలకు రాజకీయ సాధికారత అనేది టీడీపీ డీఎన్ఏ లోనే ఉందని యనమల దివ్య పేర్కోన్నారు. బీసీలకు రాజకీయ సాధికారితే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని ప్రభుత్వ యనమల దివ్య పేర్కొన్నారు.

## కూటమి అభ్యర్థుల విజయం మన బాధ్యత: గన్ని కృష్ణ



**కాకినాడ రూరల్, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరపున ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా వారి విజయానికి పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని, అది మన బాధ్యత కర్తవ్యం అని నియోజకవర్గ అబ్జర్వర్ గన్ని కృష్ణ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నాయకత్వంపై విశ్వాసంతో క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.వాకలపూడి మహాలక్ష్మి నగర్ లో కాకినాడ రూరల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇంచార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం కేడర్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా గన్ని కృష్ణ హాజరై పార్టీ శ్రేణులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గన్ని కృష్ణ క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయమే తుది నిర్ణయంగా భావించి, అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో రూరల్ ఎఎంసి చైర్మన్ మాసుమెను మంగ గంగయ్య, ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు, కరప,రూరల్ మండల అధ్యక్షులు మద్దూరి స్వామి, కాళ్ళ శ్రీనివాస్,క్లస్టర్ కన్వీనర్లు కర్రి వెంకట రాజు, తాతపూడి రామకృష్ణ, పెరబత్తుల లోవబాబు,ప్రకాష్, తెలుగు యువత అధ్యక్షులు పిల్లి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి లోవరాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాత లక్ష్మణ్,గ్రామ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**డ్రెయిన్లు, కాంపాక్టర్ల వద్ద చెత్త నిల్వ ఉండ కూడదు**

**శానిటేషన్ సిబ్బందితో సమీక్షలో కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ**



**కాకినాడ, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఉదయం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డ్రెయిన్ల శుభ్రత, నిల్వ నీటి నివారణ, ఇంటింటి చెత్త సేకరణ, కాంపాక్టర్ల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. స్థానిక కమ్యూనిటీ నాయకులతో సమన్వయం చేసుకుని వారి పరిధిలోని సమస్యాత్మక, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి శానిటేషన్ సెక్రటరీ తమ పరిధిలోని డ్రెయిన్లను స్వయంగా పరిశీలించి, దగ్గరుండి శుభ్రం చేయించాలని, పనుల పురోగతిపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

**నిల్వ నీటిపై తక్షణ చర్యలు**

ఎక్కడైనా నీరు నిలిచే పరిస్థితి ఉంటే వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని కమిషనర్ స్పష్టం చేశారు. అవసరమైన చోట్ల జెట్టింగ్ యంత్రాలను వినియోగించి డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలు, మురుగునీటిని తొలగించాలని సూచించారు. నీరు ముందుకు వెళ్లేందుకు మార్గం లేని ప్రాంతాల్లో తాత్కాలికంగా కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేసి నిల్వ నీటిని మళ్లించాలని ఆదేశించారు. దోమల నియంత్రణకు అవసరమైన ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించాలన్నారు.

**కాంపాక్టర్ల వద్ద చెత్త ఉండకూడదు**

స్వయం భూ వాహనాల ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ పకడ్బందీగా జరిగేలా చూడాలని తెలిపారు. కాంపాక్టర్ల వద్ద ఎక్కడా వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. కాంపాక్టర్ల వద్ద చెత్త నిల్వ ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత శానిటేషన్ సెక్రటరీనే బాధ్యుడిని చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిరంతరం పర్యటిస్తూ ప్రజలకు ఎదురవుతున్న పారిశుద్ధ్య సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. ప్రతి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీ తమ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ రామశాస్త్రి, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## ఏలేశ్వరంలో వైభవంగా శ్రీ వరసిద్ధి వినాయక స్వామి శోభాయాత్ర



**ఏలేశ్వరం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక పల్లపు వీధి రామాలయం వద్ద 9వ వార్డు మాజీ కౌన్సిలర్ శిడగం కన్నారావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 18వ వార్షిక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి నిమజ్జన ఊరేగింపు మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ శోభాయాత్ర కార్యక్రమానికి రాష్ట్ర వైసీపీ యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవింద్ ముఖ్య అతిథిగా హాజరైయారు, గోవింద చేతుల మీదుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా బదిరెడ్డి గోవింద్ మాట్లాడుతూ ఆది దేవుడు విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.వరుసగా 18 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను, నిర్వాహకులను ఆయన అభినందించారు.?ఈ కార్యక్రమంలో 9వ వార్డు మాజీ కౌన్సిలర్ శిడగం కన్నారావు, పల్లపు వీధి యూత్ సభ్యులు, స్థానిక ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి శోభాయాత్రలో పాల్గొన్నారు.భక్తుల జయజయధ్వానాలు, మేళతాళాల నడుమ ఊరేగింపు అత్యంత ఉత్సాహంగా సాగింది.పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

## సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ సంస్మరణ సభ



**ఏలేశ్వరం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యలపై నిత్యం పోరాడిన ప్రజా నాయకుడు, సీపీఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ సంస్మరణ సభను ఆదివారం ఏలేశ్వరం పట్టణంలోని వినోద్ మిశ్రా కాలనీలో ఘనంగా ఏర్పాటు చేశామని ఆ పార్టీ నాయకులు వివరించారు ఈ మేరకు శనివారం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు.ఈ సందర్భంగా ఎం చలపతి మాట్లాడుతూ.. కొసిరెడ్డి గణేష్ సాధారణ కార్యకర్తగా మొదలై రాష్ట్ర కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. పేదలు, కార్మికులు, రైతుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ముఖ్యంగా ఏలేశ్వరం ప్రాంతంలో భూ సమస్యలు, ఇళ్ల పట్టాల సమస్యలు, కార్మికుల కనీస వేతనాల కోసం ఆయన చేసిన ఉద్యమాలు చిరస్మరణీయమన్నారు.వినోద్ మిశ్రా కాలనీ ఏర్పాటులో ఆయన పాత్ర కీలకమని, పేదలకు సొంత ఇళ్లు కల్పించాలనే ఆశయంతో ఈ కాలనీకి ఆ మహానేత పేరు పెట్టి అభివృద్ధి చేశారని గుర్తు చేసుకున్నారు.గణేష్ మృతి పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన చూపిన బాటలో నడుస్తామని, ఆయన ఆశించిన సమసమాజ స్థాపన కోసం, ప్రజా సేవకు తమ జీవితాలను అంకితం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సభను పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ విలేకరుల సమావేశం ద్వారా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు అడ్వకేట్ ఐ సూర్యనారాయణ, వినోద్ మిశ్రా సహాయ కార్యదర్శి కందుల ప్రసాద్, వినోద్ మిశ్రా పార్టీ కార్యదర్శి గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, జి.సాయి, తదితరులు మిశ్రాశ్రేణులు పాల్గొన్నారు.

## భీమవరపుకోటలో ప్రశాంతంగా ముగిసిన ఎస్ఎంసి ఎన్నికలు

**ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికలు - ఎన్నికలకు సిఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు**





**కోటనందూరు, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలంలో భీమవరపుకోట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వాయిదా పడిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలను శనివారం ప్రత్యేక అధికారి ఎస్ వి రమణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నడుమ ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. సెప్టెంబర్ 29న నిర్వహించాల్సిన ఎన్నికలు కొన్ని కారణాల వల్ల వాయిదా పడగా, అధికారులు శనివారం తిరిగి ఎన్నికల ప్రక్రియను చేపట్టారు.శంఖవరం మండల విద్యాశాఖ అధికారి ఎస్ వీ రమణ ఎన్నికల అధికారిగా వ్యవహరించి ఇరు పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహించారు. ముందుగా సభ్యుల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా శిమ్మనపూడి వరహాల బాబు, వైస్ చైర్మన్‌గా ఆరుగుల విజయకుమారి ఎన్నికయ్యారు. అదేవిధంగా భీమవరపుకోట ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా బోడపాటి రమణమ్మ, వైస్ చైర్మన్‌గా ఆరుగుల పోతయ్య ఎన్నికయ్యారు. వీరంతా తెదేపా మద్దతుదారులు.ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు పర్యవేక్షణలో ఎస్సై టీ. రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, పాఠశాల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లకు ఎన్నికైన ఎస్ఎంసీ నూతన చైర్మన్ లు, వైస్ చైర్మన్ లను లోవ దేవస్థానం చైర్మన్ పెంటకోట భాస్కర్ సత్యనారాయణ, మండల టిడిపి పార్టీ ప్రెసిడెంట్ పోతల సూరిబాబు, తాండవ జలాశయం వైస్ చైర్మన్ మేడపురెడ్డి జోగు బాబు, కె అప్పలనాయుడు, గుడివాడ తాతబాబు, సింగంపల్లి అరుణ తేజ (చిన్ని),కూండ్రపు పైడియ్య నాయుడు,కె దొరబాబు, తానారి దాసు, రావాడ కన్నబాబు, దండా రాజు, దెందేటి పృధ్వి, నాగులాపల్లి సంజీవరావు, ఆరుగుల వీరబాబు, దండా కొండ బాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు అభినందనలు తెలిపారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించే దిశగా నూతన కమిటీలు పనిచేయాలని పలువురు ఆకాంక్షించారు.

## భీమవరపుకోట గ్రామంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సిఐ





**కోటనందూరు, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా, ఈరోజు కోటనందూరు మండలం భీమవరపుకోట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను తుని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవ రావు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ఓటర్ల రాకపోకలకు అనుకూలమైన పరిస్థితులు, పోలీసు బందోబస్తు ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. ఈయన వెంట కోటనందూరు ఎస్సై టీ. రామకృష్ణ కూడా పాల్గొని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం సీఐ చెన్నకేశవరావు గ్రామస్తులతో సమావేశమై మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎటువంటి చర్యలకు పాల్పడకుండా, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు మరియు పోలీసు సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎటువంటి వివాదాలు లేదా అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసు శాఖకు సహకరించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

## 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

**సేవా జ్యోతి యాత్ర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే దివ్య**



**కోటనందూరు, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** వికసిత్ భారత్ 2047 లక్ష్యసాధనలో కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య అన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో యువత సేవా భావన పెంపొందించుకుని దేశభక్తి స్వచ్ఛత సామాజిక బాధ్యతపై అవగాహన పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే యనమల దివ్య పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా,తుని మండలం తేటగుంట క్యాంప్ కార్యాలయంలో సేవా జ్యోతి యాత్రను సీనియర్ నేత యనమల రాజేష్‌తో కలిసి ప్రభుత్వ విఫ్ యనమల దివ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



# రియల్ ఎస్టేట్ రంగ ప్రోత్సాహానికి సంస్కరణలు

## 'క్రెడాయ్ హోమ్ ఎక్స్ పో'లో మంత్రి నారాయణ - రెండవరోజూ పోటెత్తిన సందర్శకులు





**రాజమహేంద్రవరం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** రియల్ ఎస్టేట్ రంగం కూడా అభివృద్ధి చెందితేనే రాష్ట్ర అభివృద్ధికి కారణమవుతుందని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. అందుకే రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం ప్రోత్సాహానికి పలు సంస్కరణలు తెచ్చామని ఆయన చెప్పారు. ఇంకా ఎలాంటి సమస్యలున్నా సరే, పరిష్కరిస్తామన్నారు. స్థానిక జె.ఎన్. రోడ్డులోని చెరుకూరి వీర్రాజు, సుబ్బలక్ష్మి కన్వేషన్ సెంటర్ లో క్రెడాయ్ రాజమహేంద్రవరం చాప్టర్ నిర్వహిస్తున్న 'హోమ్ ఎక్స్ పో' రెండవరోజు శనివారం సందర్శ కులతో పోటెత్తింది. ముఖ్య అతిధిగా మంత్రి నారాయణ పాల్గొన్నారు. క్రెడాయ్ పక్షాన నిర్వాహకులు మంత్రిని సన్మానించారు. ఈ సందర్బంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ సొంతింటి కల నెరవేర్చుకోడానికి అన్ని విభాగాలతో క్రెడాయ్ హోమ్ ఎక్స్ పో నిర్వహించడం పట్ల మంత్రి నారాయణ హర్షం వ్యక్తంచేశారు. నిర్వాహకులను అభినందిస్తూ, ప్రతి జిల్లాలో ఇలాంటి హోమ్ ఎక్స్ పోలు పెట్టి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్ధిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని, అందులో భాగంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని పూర్తిగా నాశనం చేసారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో ఆర్ధిక ప్రగతి కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని మంత్రి నారాయణ తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయించారని, అలాగే క్రెడాయ్ ప్రతినిధులతో, ఇతరులతో కూడా చర్చించి పలు సంస్కరణలు తెచ్చినట్లు మంత్రి నారాయణ వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సంస్కరణలు తెచ్చామన్నారు. నిర్మాణ రంగ ప్రోత్సాహంలో భాగంగా అనుమతుల కోసం ఆన్ లైన్ విధానం మొదట గుంటూరు తర్వాత విజయవాడ, నెల్లూరులలో అమలు చేసాక రాష్ట్రమంతా విస్తరించామని ఆయన చెప్పారు. అన్ని డాక్యుమెంట్స్ తో ఆన్ లైన్ లో దరఖాస్తు చేస్తే 24గంటల్లో భవనాలకు, లే ఔట్లకు అనుమతి ఇవ్వాలని స్పష్టం చేశామని మంత్రి నారాయణ చెప్పారు. మున్సిపల్ సంస్కరణల వలన రాష్ట్రానికి కేంద్రంనుంచి రూ 800కోట్లు వచ్చాయన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, బిజెపి నాయకుడు కంటిపూడి సర్వారాయుడు తదితరులు విచ్చేసారు. క్రెడాయ్ రాష్ట్ర చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్, రాజమహేంద్రవరం చాప్టర్ చైర్మన్ సూరవరపు శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ మన్యం సంతోష్ ఫణికుమార్, జనరల్ సెక్రటరీ చల్లా బాల మురళికృష్ణ, హానరరీ చైర్మన్ మన్నే సుబ్బారావు, ఎన్విరాన్ మెంట్ కమిటీ మెంబర్ కర్రి శేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, కోశాధికారి టివిఎల్ నరసింహారావు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గొందేసి పూర్ణచంద్రారెడ్డి జయంతి

## ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహణ - భారీగా తరలివచ్చిన స్థానికులు, ప్రజలు - తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తా : శ్రీనివాసులు రెడ్డి



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం: స్వర్గీయ గొందేసి పూర్ణచంద్రారెడ్డి 87వ జయంతిని పురస్కరించుకుని గొందేసి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలాజీపేట జంక్షన్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ గొందేసి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజలు భారీ సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమానికి మాజీ హోంమంత్రి వనిత, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, గురుమూర్తి రెడ్డి, రౌతు సూర్యప్రకాశరావు, రాజమహేంద్రవరం యూత్ ఐకాన్ జక్కంపూడి గణేష్, గిరిజాల బాబు, బాక్స్ ప్రసాద్, డాక్టర్ గూడూరు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, యూత్ లీడర్ కేఆర్‌జే రాజేష్, నక్క రాజబాబు, ప్రముఖ న్యాయవాదులు, స్థానిక నాయకులు తదితరులు హాజరయ్యారు. ముందుగా గొందేసి శ్రీనివాసులు రెడ్డి తన తండ్రి గొందేసి పూర్ణచంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అతిథులతో కలిసి కేక్ కట్ చేసి మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వాసవి ఐ కేర్ హాస్పిటల్, స్మార్ట్ హాస్పిటల్, శ్రీవాణి డెంటల్ హాస్పిటల్ వారి సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు, కంటి, దంత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా మాజీ హోంమంత్రి వనిత మాట్లాడుతూ గొందేసి పూర్ణచంద్రారెడ్డి సేవలు మరువలేనివని అన్నారు. ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించిన ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, చేసిన సేవలు ఎప్పటికీ ప్రజల మధ్య నిలిచిపోతాయని పేర్కొన్నారు. శ్రీనివాసులు రెడ్డికి మంచి రాజకీయ భవిష్యత్తు ఉందని అన్నారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ పూర్ణచంద్రారెడ్డి మంచి పారిశ్రామికవేత్తగా, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచే వ్యక్తిగా గుర్తింపు పొందారని అన్నారు. తండ్రి సేవా తత్వం శ్రీనివాసులు రెడ్డికి వచ్చిందని, అదే మార్గంలో ఆయన నడుస్తున్నారని తెలిపారు. శ్రీనివాసులు రెడ్డికి తమ సహకారం ఉంటుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ పూర్ణచంద్రారెడ్డి అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి అని అన్నారు. శ్రీనివాసులు రెడ్డి మంచి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని, తండ్రికి తగ్గ తనయుడిగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. యూత్ ఐకాన్ జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షించారు. శ్రీనివాసులు రెడ్డితో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. ట్రస్ట్ చైర్మన్ గొందేసి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తానని, ఆయనకు మచ్చ తెచ్చే పని ఏనాడూ చేయనని అన్నారు. ట్రస్ట్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. తనకు అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# దివ్యాంగులకు అండగా నిలుద్దాం.. భవిష్యత్తుకు ధైర్యాన్నిద్దాం

## రూ.30 లక్షల నిధులతో సహాయ పరికరాల పంపిణీకి శ్రీకారం

**రాజమహేంద్రవరం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** దివ్యాంగులకు అండగా నిలిచి వారి భవిష్యత్తుకు ధైర్యాన్ని అందించేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపునిచ్చారు. గెయిల్ సంస్థ సామాజిక బాధ్యత నిధుల నుంచి రూ.30 లక్షలతో దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించేందుకు రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని వి.కన్వెన్షన్‌లో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు సంయుక్తంగా శిబిరాన్ని ప్రారంభించారు.

### నాలుగు రకాల పరికరాలకు నమోదు

దివ్యాంగుల నుంచి బ్యాటరీతో నడిచే మూడు చక్రాల వాహనాలు, చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, నడక కర్రల కోసం నమోదు ప్రక్రియ చేపట్టారు. లబ్ధిదారుల అవసరాలను పరిశీలించి అర్హతకు అనుగుణంగా పరికరాలను అందజేస్తామని అధికారులు తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి ఆగదు

మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గెయిల్ సంస్థ సామాజిక బాధ్యత నిధుల ద్వారా రూ.30 లక్షలతో దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అవసరమైన వారికి ఉపయోగపడేలా సామాజిక బాధ్యత నిధులను ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నిధులు సమకూర్చడంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేసిన కృషిని అభినందించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రాజమహేంద్రవరం నగరంతో పాటు పుష్కరాలకు సంబంధించిన పరిసర పురపాలక ప్రాంతాల్లో సుమారు రూ.2 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 2014-19 మధ్య రాజమహేంద్రవరం పుష్కరాల సందర్భంగా పురపాలక శాఖ ద్వారా నగరం, పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సుమారు రూ.1,000 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు.

### సామాజిక బాధ్యత నిధులతో మరింత సేవ

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థల సహకారం జోడిస్తే ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. గెయిల్ సంస్థను సామాజిక బాధ్యత నిధులు కోరగా రూ.30 లక్షలు



కేటాయించిందన్నారు. ఈ నిధులతో నాలుగు రకాల సహాయ పరికరాలు అందించేందుకు నమోదు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. ప్రజలకు మేలు చేసే ప్రతి అవకాశాన్ని అన్వేషిస్తూ పనిచేస్తున్నామని చెప్పారు. పుష్కరాల ఏర్పాట్లకు ప్రభుత్వం సుమారు రూ.2 వేల కోట్ల వరకు నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే పనులకు మరిన్ని నిధులు కేటాయించాలని మంత్రి నారాయణను కోరినట్లు తెలిపారు.

### ప్రజా సేవలో ఎమ్మెల్యే కృషి అభినందనీయం

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు తనవంతు బాధ్యతగా ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నగరంలో చక్కటి పార్కులు, ప్రజలకు ఉపయోగపడే సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి సామాజిక బాధ్యత నిధులను సమీకరించి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమన్నారు. ప్రజలకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సమష్టి కృషి అవసరమని తెలిపారు. కార్యక్రమంలో గెయిల్ అధికారులు, సంస్థ ప్రధాన అధికారి శివ్‌కుమార్, మానవ వనరుల విభాగం అధికారి డి.వి. ప్రభాకర్, పోతయ్య, నీలం ముఖర్జీ, శాంతిసాగర్, దివ్యాంగులు, ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.ఇదే వార్తను కావాలంటే ఈనాడు జిల్లా పేజీకి తగ్గట్టుగా మరింత కుదించి 20--25 లైన్లలో కూడా తయారు చేయవచ్చు.

# విద్యార్థుల సృజనాత్మకతకు అధిక ప్రాధాన్యం



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** నారాయణ స్కూల్ ఆర్‌జేడి -ఎఆర్‌పి బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్‌ఎల్‌సి) కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం జీఎం విజయ భాస్కర్ రెడ్డి, ఏజీఎం ఎస్‌కె అలీషా, ప్రిన్సిపాల్ డి.వి.శైలజ, ఈ -కిడ్జ్ ఈ - ఛాంప్స్ ఆర్ డి ఎస్ మోహిని, సుస్మిత, జెడ్ సి,స్ మాధురి, హరిత చేతుల మీదుగా వైభవంగా ప్రారంభమైంది. విద్యార్థులు తమలోని ప్రతిభ, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం కమ్యూనికేషన్ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఎస్ ఎల్ సి కార్యక్రమం ఒక అద్భుతమైన వేదికగా నిలిచింది. వివిధ అంశాలపై విద్యార్థులు స్వయంగా తమ అభ్యాసాన్ని, ప్రతిభను ప్రదర్శించడం తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఎంతగానో ఆకట్టుకుంది."పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిలో సృజనాత్మకతతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఎస్ ఎల్ సి కార్యక్రమం ప్రధాన లక్ష్యం"గా సాగింది. విద్యార్థుల సమగ్ర వికాసానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఎ జి ఎం, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్ బి. కుసుమ ఎం. అపర్ణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.

### బోడిగూడెం ఆశ్రమం పాఠశాలను

# పరిశీలించిన బొరగం శ్రీనివాసులు



**పోలవరం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం మండలం బోడి గూడెం ఆశ్రమం పాఠశాలను నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ & ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పాఠశాలలో విద్యార్థులకు భోజనం, వసతులు, విద్యా అందిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అధ్యాపకులతో మాట్లాడే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని అధ్యాపకులకు సూచించారు క్లాస్ రూమ్‌కు వెళ్లి అధ్యాపకులు విద్యార్థులకు ఎలా బోధిస్తున్నారు అని క్లాస్ రూమ్‌లో కూర్చుని పరీక్షించారు. అనంతరం అధ్యాపకులతో మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏమైనా అవసరం ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అన్నదాన కార్యక్రమం



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. సీఐ అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ అప్పారావు మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏడాది వినాయక చవితి పండుగను పురస్కరించుకుని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో అన్న వితరణ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. భక్తులకు, స్థానిక ప్రజలకు అన్నదానం చేయడం ద్వారా సామాజిక సేవలో పోలీసు శాఖ కూడా భాగస్వామ్యం అవుతోందని అన్నారు. ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ సమక్షంలో జరిగిందని, ఆయన సూచనల మేరకు అన్నదానాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో రాజమహేంద్రవరం ట్రాఫిక్ విభాగం పోలీసులు, వివిధ విభాగాలకు చెందిన పోలీసు సిబ్బంది అందరూ చురుగ్గా పాల్గొన్నారన్నారు. అలాగే సుమారు 1500 నుంచి 2000 మంది వరకు భక్తులు, నిరుపేదలు, స్థానికులు ఈ అన్నదానంలో పాల్గొని భోజనం చేశారని సీఐ అప్పారావు మీడియాకు తెలిపారు. ఘనంగా జరిపిన అన్నదానా వితరణను పోలీసుల సేవా కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.

### స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2026లో

# మన గోదావరి అబ్బాయి చైతన్యకు రాష్ట్రస్థాయి పురస్కారం



**సీతానగరం, అక్టోబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** చిన్న పల్లెటూరిలో పుట్టి, స్వయంకృషితో సోష ల్ మీడియా రంగంలో తన కంటూ ప్రత్యేక గుర్తింపు తె చ్చుకున్న మైలపల్లి చైతన్య కు రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2026 రాష్ట్రస్థాయి పుర స్కారాల ప్రదానోత్సవంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు చేతుల మీదుగా చైతన్య బెస్ట్ సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ అవార్డు అందు కున్నారు.రాజమండ్రి సమీ పంలోని సీతానగరానికి చెం దిన మైలపల్లి చైతన్య, ఇన్ స్టాగ్రామ్‌లో 'మన గోదావరి అబ్బాయి' పేరుతో వీడి యోలు చేస్తూ ప్రజలకు చేరువయ్యారు. సుమారు ఎనిమిదేళ్ల క్రితం సోషల్ మీడియా ప్రయాణాన్ని ప్రారంభించిన ఆయన, ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటూ తన ప్రతి భతో ఈ స్థాయికి చేరు కున్నారు. ఇటీవల భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన రీల్ పోటీలో ఆంధ్రప్రదేశ్‌లోని పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లు యెన్సర్లు పాల్గొన్నారు. ఈ పోటీలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన టాప్ 10 మందిని విజేతలుగా ఎంపిక చేయగా, వారిలో 'మన గోదావరి అబ్బాయి' మైల పల్లి చైతన్య కూడా స్థానం సంపాదించారు.తన సొంత గ్రామమైన సీతానగరంలోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని డిజిటల్ మీడి యా రంగంలో తన ప్రస్థా నాన్ని కొనసాగిస్తున్నారు. మరోవైపు, 'మన గోదావరి అబ్బాయి' పేరుతో ఇన్‌స్టా గ్రామ్‌లో స్థానిక ప్రాంతాల విశేషాలు, ప్రజలకు ఉప యోగపడే అంశాలు, గోదా వరి సంస్కృతి, సంప్రదా యాలను వీడియోల రూపం లో అందిస్తూ ప్రత్యేక గుర్తిం పు పొందారు. ఈ క్రమంలో ఆయన చేసిన కృషికి గుర్తిం పుగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2026లో బెస్ట్ సోషల్ మీడి యా ఇన్‌ఫ్లుయెన్సర్ అవా ర్డు లభించింది.చిన్న పల్లె టూరి నుంచి ప్రారంభమైన తన ప్రయాణంలో రాష్ట్ర స్థాయి అవార్డును ముఖ్య మంత్రి చేతుల మీదుగా అందుకోవడం ఎంతో ఆనం దంగా ఉందని చైతన్య సం తోషం వ్యక్తం చేశారు.సీతానగరం నుంచి రాష్ట్ర స్థాయి అవార్డు వరకు చైత న్య సాగించిన ప్రయాణం స్థానిక యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.



# సింగర్స్ లేరని ఆ సినిమాలో పాట పాడిన త్రివిక్రమ్..

### ఇప్పటికీ యూట్యూబ్‌లో సెన్సేషన్ ఆ పాట..

దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ గురించి చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఆదర్శ కుటుంబం సినిమాతో అడియన్స్ ముందుకు రాబోతున్నారు. ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తాను ఓ సినిమాలో పాట పాడిన అరుదైన అనుభవాన్ని పంచుకున్నారు. సింగర్స్ లేకపోవడంతో, ఆయన, కోటి గారు కలిసి ఓ పాటలో కోరస్ పాడినట్లు గుర్తు చేసుకున్నారు. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో హీరో వెంకటేశ్ నటిస్తున్న లేటేస్ట్ మూవీ ఆదర్శ కుటుంబం. ఈ చిత్రాన్ని త్వరలోనే అడియన్స్ ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ క్రమంలోనే ఈ చిత్రం ప్రమోషన్లలో పాల్గొంటున్న త్రివిక్రమ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన కెరీర్‌లో అరుదైన గాయకుడిగా మారిన సంఘటనలను, అలాగే తన వ్యక్తిగత అభిప్రాయాలను ఈ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆయన దర్శకత్వం వహించిన నువ్వే నువ్వే చిత్రంలోని "కంప్యూటర్స్, ఆర్ట్స్, సైన్స్" పాట ప్రారంభ కోరస్‌ను తానే పాడినట్లు వెల్లడించారు. ఈ పాట రికార్డింగ్ సమయంలో రాత్రి బాగా పొద్దుపోవడంతో, గాయకులు ఎవరూ అందుబాటులో లేరు. మరుసటి రోజు చిత్ర యూనిట్ ఊటీలో షూటింగ్‌కు బయలుదేరాల్సి ఉండటంతో సమయం తక్కువగా ఉండేది. అప్పటి పరిస్థితులలో నేరుగా రికార్డింగ్ చేసుకునే సాంకేతికత కూడా అందుబాటులో లేకపోవడం వల్ల, సంగీత దర్శకుడు కోటితో కలిసి త్రివిక్రమ్ స్వయంగా ఆ పాటలోని కొన్ని లైన్లను ఆలపించారు. "పాపంరో పాపాయిరో" వంటి నాలుగు లైన్ల లిరిక్స్ మాత్రమే తాను పాడానని, "కంప్యూటర్స్, ఆర్ట్స్, సైన్స్" పాటలోని ప్రధాన భాగాన్ని మాత్రం గాయకులే పాడారని త్రివిక్రమ్ స్పష్టం చేశారు. ఈ సంఘటన ఆయన సినీ కెరీర్‌లో ఒక ఆసక్తికరమైన జ్ఞాపకంగా నిలిచిపోయింది. నువ్వే నువ్వేలో కోరస్ పాడిన తర్వాత, త్రివిక్రమ్ గురు చిత్రంలో ఒక పూర్తి పాటను పాడి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఆయన తన గాన ప్రయాణాన్ని గురించి మరింత వివరించారు. నటుడు వెంకటేష్ కూడా ఇటీవల పాటలు పాడి పెద్ద హిట్ అందుకున్నారని, గతంలో ఒక ఈవెంట్లో తాను పాడతానన్నా కూడా అవకాశం ఇవ్వలేదని త్రివిక్రమ్ సరదాగా గుర్తు చేసుకున్నారు. జనవరి 12న విడుదల కానున్న ఒక చిత్రంలో మళ్లీ పాట పాడతారా అని అడగగా, దాని గురించి ఇంకా ఏమీ అనుకోలేదని, దర్శకుడు అనిల్‌ని కనుక్కుంటానని చెప్పారు. త్రివిక్రమ్ శ్రీనివాస్, వెంకటేష్ వంటి ప్రముఖులు సాధారణంగా అరుదుగా ఇంటర్వ్యూలలో కనిపిస్తుంటారు. దీనిపై త్రివిక్రమ్ స్పందిస్తూ, తాను సినిమా విడుదలైనప్పుడు మాత్రమే మాట్లాడుతానని, వ్యక్తిగత విషయాలు పెద్దగా



ఆసక్తికరంగా ఉండవని అభిప్రాయపడ్డారు. తన ఆరోగ్యం, వ్యక్తిగత విషయాలను బహిరంగంగా చర్చించడం తనకు ఇష్టం ఉండదని తెలిపారు. తన జ్ఞాపకశక్తి గురించి మాట్లాడుతూ, సినిమాలలోని పాత్రల పేర్లు కూడా గుర్తుంచుకోవడం తనకు కష్టమని, సాధారణంగా ఎక్కువ విషయాలు గుర్తుపెట్టుకోనని సరదాగా చెప్పారు. తన పిల్లలైన సంపూర్ణ, సర్వ పేర్లను మాత్రం ఖచ్చితంగా గుర్తుంచుకున్నానని వెల్లడించారు.

# తప్పకుండా చర్యలు తీసుకుంటాం..

### చుట్టమల్లె సాంగ్ వివాదంపై జాన్వీ కపూర్ రియాక్షన్..



'దేవర' చిత్రంలోని 'చుట్టమల్లే' పాటను ఏఐ టెక్నాలజీతో అసభ్యకరంగా మార్ఫింగ్ చేయడంపై హీరోయిన్ జాన్వీ కపూర్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి నకిలీ వీడియోలను క్రియేట్ చేయడం, షేర్ చేయడం ఏఐ దుర్వినియోగమేనని పేర్కొంటూ, ఈ వికృత చేష్టలకు పాల్పడిన వారిపై తప్పకుండా తీవ్రమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆమె గట్టిగా హెచ్చరించారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన ఏఐ వీడియోస్ చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియా, యూట్యూబ్ వంటి ప్లాట్ ఫామ్స్ లో ఏదోక విషయంపై ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కంటెంట్ వైరల్ అవుతుంది. అయితే ఈ సాంకేతికతను కొందరు వ్యక్తులు దుర్వినియోగం చేయడం మాత్రం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి హీరోహీరోయిన్స్ చిత్రాలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేయడం ఇటీవల కాలంలో ఎక్కువైందే. అయితే కేవలం కథానాయికల చిత్రాలు కాదు.. ఇప్పుడు దేవర చిత్రంలోని చుట్టమల్లే పాటను సైతం ఏఐ ఉపయోగించి అసభ్యకరంగా సృష్టించారు. ఇప్పుడు ఈ విషయం సినీ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. ఇప్పటికే ఈ ఏఐ వీడియోపై మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ రియాక్ట్ అయిన సంగతి తెలిసిందే. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఇక ఇప్పుడు ఈ వివాదం పై హీరోయిన్ జాన్వీ కపూర్ సైతం స్పందించింది. ఏఐ టెక్నాలజీని ఇలా దుర్వినియోగం చేయడం కలవరపాటుకు గురిచేస్తోందని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ఏఐ ద్వారా సృష్టించిన ఇలాంటి నకిలీ వీడియోలను దయచేసి ఎవరూ క్రియేట్ చేయవద్దు, ఇతరులతో షేర్ చేయవద్దు లేదా ప్రచారం చేయవద్దు " అని ట్వీట్స్ చేశారు. ఇది ఏఐ టెక్నాలజీని స్పష్టంగా దుర్వినియోగం చేయడమేనని, ఈ వికృత చేష్టలకు పాల్పడిన వారిపై ఖచ్చితంగా తీవ్రమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గట్టి హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం జాన్వీ ట్వీట్ నెట్టింట వైరలవుతుంది.

# త్రివిక్రమ్ సినిమాకు గట్టి పోటీ ఇవ్వనున్న చిన్న సినిమా..



ప్రస్తుతం వెంకటేష్ జోరు పెంచారు. వరుస హిట్స్ తో దూసుకుపోతున్న వెంకటేష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైనప్ చేస్తున్నారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా తర్వాత మన శంకర్ వరప్రసాద్ గారు సినిమాలో స్పెషల్ రోల్ చేశారు వెంకీ. సినిమా కూడా మంచి విజయాన్ని అందుకుంది. అలాగే ఇప్పుడు రెండు సినిమాలతో రాబోతున్నారు వెంకీ, తెలుగు సినిమా ప్రేక్షకులు కొంతకాలంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా హనుమాన్ అంశ్. ఈ సినిమా తెలుగు రిలీజ్‌కు ఎట్టకేలకు క్లారిటీ వచ్చేసింది. హిందీ బాక్సాఫీస్ దగ్గర ఊహించని స్థాయిలో సక్సెస్ సాధించిన ఈ ఆధ్యాత్మిక చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అయితే ఈ రిలీజ్ డేట్ ఇప్పుడు టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన పోటీకి తెరతీసింది. హోంబలే ఫిల్మ్స్ అధికారికంగా ప్రకటించిన వివరాల ప్రకారం.. హనుమాన్ అంశ్ తెలుగు వెర్షన్ అక్టోబర్ 9, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. దీంతో ఇన్నాళ్లుగా కొనసాగుతున్న తెలుగు రిలీజ్ సస్పెన్స్‌కు తెరపడింది. విశాల్ చతుర్వేది దర్శకత్వంలో తెరకెక్కిన 'హనుమాన్ అంశ్' నీమ్ కరోలి బాబా జీవితంలోని ఆధ్యాత్మిక ప్రయాణం ఆధారంగా రూపొందిన సినిమా. భారీ బడ్జెట్, స్టార్ హీరోలు లేకుండానే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకున్న ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాన్ని అందుకుంది. సుమారు రూ.2 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్ల మార్క్‌ను దాటడం విశేషం. ముఖ్యంగా ప్రారంభంలో నెమ్మదిగా సాగిన కలెక్షన్లు.. పాజిటివ్ వర్డ్ ఆఫ్ మౌత్‌తో భారీగా పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు తెలుగు ప్రేక్షకులు ఈ సినిమాను ఎలా రిసీవ్ చేసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. 'హనుమాన్ అంశ్' తెలుగు రిలీజ్ విషయంలో ముందుగా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పేరు వినిపించింది. ఆయనకు చెందిన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ద్వారా ఈ చిత్రాన్ని తెలుగులో తీసుకురావాలని అప్పట్లో ప్లాన్ చేశారు. సెప్టెంబర్ 18న తెలుగు వెర్షన్‌ను విడుదల చేయాలనే ఆలోచన కూడా జరిగింది. హైదరాబాద్‌లో టీజర్ లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్ వంటి కార్యక్రమాలకు ఏర్పాట్లు జరిగినప్పటికీ.. చివరి నిమిషంలో అవి రద్దయ్యాయి. ఆ తర్వాత తెలుగు రిలీజ్ ప్లాన్ కూడా మారిపోయింది. అయితే త్రివిక్రమ్ ఈ ప్రాజెక్ట్ నుంచి ఎందుకు తప్పుకున్నారనే విషయంలో అధికారికంగా స్పష్టమైన కారణం వెల్లడికాలేదు.

# 'అమ్మాయిలందరికీ గర్వకారణం'..

### చికితారావును అభినందించిన నీతా అంబానీ



ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన తెలంగాణకు చెందిన ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితకు రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ అభినందనలు తెలిపారు. అమ్మాయిలందరికీ గర్వకారణంగా, స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఈమేరకు చికితాతో నీతా అంబానీ వీడియో కాల్‌లో మాట్లాడారు. ఇది తన మొదటి ఆసియా క్రీడలని చికిత తెలిపారు. తమ బృందం విజయంతో కాంపౌండ్ ఆర్చరీలో తొలిసారి భారత్‌కు ఒలింపిక్స్ బెర్త్ ఖరారైందని చెప్పారు. నీతా అంబానీ మాట్లాడుతూ.. ఒలింపిక్స్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. రిలయన్స్ ఫౌండేషన్ తరఫున సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తాను ఒక రైతుబిడ్డనని చికిత చెప్పగా.. రైతులే దేశానికి వెన్నెముక అని నీతా అంబానీ పేర్కొన్నారు.

# గోల్డ్ నంబర్ 20 అమన్ సెహ్రావత్ పసిడి పట్టు



ఆసియా క్రీడల్లో శనివారం పసిడిపంట పండింది. ఆర్చరీ, గోల్ఫ్, క్రికెట్.. తాజాగా రెజ్లింగ్‌లో మరో స్వర్ణం సొంతమైంది. రెజ్లర్ అమన్ సెహ్రావత్ పట్టుకు.. ఉత్తర కొరియా ఆటగాడు, ప్రపంచ ఛాంపియన్ చాంగ్ సాంగ్ హాన్ తలవంచాడు. పురుషుల 57 కేజీల విభాగంలో 11-7 తేడాతో అమన్ విజయం సొంతం చేసుకున్నాడు. దీంతో ఆసియా క్రీడల్లో భారత్‌కు దక్కిన బంగారు పతకాల సంఖ్య 20కి చేరింది. ప్రస్తుతం పతకాల పట్టికలో భారత్ 5వ స్థానంలో ఉంది. 20 బంగారం, 26 రజతం సహా మొత్తం 82 పతకాలను సొంతం చేసుకుంది. 167 స్వర్ణాలతో చైనా అగ్రస్థానంలో కొనసాగుతోంది. మనకంటే ముందు జపాన్, దక్షిణ కొరియా, ఉజ్బెకిస్థాన్ ఉన్నాయి.

# కష్టాల్లో ఉన్న భారత్‌ను సెంచరీతో ఆదుకున్న రాహుల్..

### వెస్టిండీస్‌కు 352 పరుగుల టార్గెట్




వెస్టిండీస్‌తో మూడో వన్డేలో కేఎల్ రాహుల్ అద్భుత సెంచరీతో చెలరేగాడు. 87 బంతుల్లో 129 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. రోహిత్ శర్మ 92, రుతురాజ్ గైక్వాడ్ 57 పరుగులు చేశారు. ఆరంభంలో గిల్, కోహ్లీ త్వరగా ఔటైనా రాహుల్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టి భారత్‌ను 351/7కు చేర్చాడు. దీంతో వెస్టిండీస్ ముందు 352 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. భారత్, వెస్టిండీస్ మధ్య మూడో వన్డేలో టీమిండియా భారీ స్కోరు చేసింది. న్యూచండీగఢ్‌లోని పీసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ చేసింది. ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కేవలం ఒక పరుగు చేసి ఔట్ కాగా, విరాట్ కోహ్లీ ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. జేడెన్ సీల్స్ వరుస బంతుల్లో ఇద్దరినీ పెవిలియన్‌కు పంపాడు. రెండు వికెట్లు త్వరగా పడటంతో భారత్‌పై ఒత్తిడి పెరిగింది. ఆ సమయంలో రోహిత్ శర్మ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. రోహిత్ 85 బంతుల్లో 92 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 3 సిక్సర్లు ఉన్నాయి. సెంచరీకి చేరువైన సమయంలో కీమో పాల్ బౌలింగ్‌లో రోహిత్ ఔట్ అయ్యాడు. రుతురాజ్ కూడా 69 బంతుల్లో 57 పరుగులు చేసి జేడెన్ సీల్స్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు.

**కేఎల్ రాహుల్ విశ్వరూపం**

రాహుల్‌కు ఈ సిరీస్‌లో ఇదే తొలి బ్యాటింగ్ అవకాశం. వచ్చిన అవకాశాన్ని అతడు పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. ఆరంభంలో జాగ్రత్తగా ఆడిన రాహుల్ క్రమంగా గేర్ మార్చాడు. 41 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత బౌండరీలతో స్కోరును వేగంగా పెంచాడు. కేవలం 80 బంతుల్లోనే వన్డే కెరీర్‌లో 9వ సెంచరీ నమోదు చేశాడు. చివరకు 87 బంతుల్లో 129 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు ఉన్నాయి.

**చివర్లో నమన్ ధీర్, కంబోజ్ మెరుపులు**

రాహుల్‌కు నమన్ ధీర్ నుంచి మంచి సహకారం లభించింది. నమన్‌ధీర్ 21 బంతుల్లో 30 పరుగులు చేశాడు. తర్వాత నితీశ్ కుమార్ రెడ్డి 9 పరుగులకే ఔట్ అయ్యాడు. అన్షుల్ కంబోజ్ 9 బంతుల్లో 17 పరుగులు చేసి వేగంగా పరుగులు జోడించాడు. దీంతో భారత్ చివరి ఓవర్లలో స్కోరు వేగాన్ని పెంచింది. రాహుల్ చివరి వరకు క్రీజులో ఉండటంతో భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 351 పరుగులు చేసింది. వెస్టిండీస్ విజయానికి 352 పరుగులు చేయాలి.

**సిరీస్‌లో భారత్ ఆధిపత్యం**

ఈ మూడో వన్డేకు ముందు భారత్ సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో ఉంది. తొలి వన్డేలో వెస్టిండీస్ 295/7 చేయగా భారత్ 300/2తో లక్ష్యాన్ని ఛేదించింది. రెండో వన్డేలో వెస్టిండీస్ 405/7 భారీ స్కోరు చేసినా భారత్ 406/2తో సంచలన ఛేజ్ పూర్తి చేసింది. శుభ్‌మన్ గిల్ 223 నాటౌట్‌తో అదరగొట్టగా, రోహిత్ శర్మ 101 పరుగులు చేశాడు. ఇప్పుడు మూడో వన్డేలో రాహుల్ 129 నాటౌట్‌తో మరో భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు.

# హాకీలోనూ మనదే స్వర్ణం.. భారత్ @ 4

ఆసియా క్రీడల్లో భారత్ పురుషుల హాకీ జట్టు స్వర్ణం సాధించింది. ఇవాళ భారత్ ఖాతాలో నాలుగు బంగారు పతకాలు చేరాయి. దీంతో మెడల్స్ పట్టికలో టీమ్ఇండియా 85 పతకాలతో నాలుగో స్థానానికి చేరుకుంది. ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలు ఉన్నాయి. దీంతో ఆసియా క్రీడలు 2026 ఎడిషన్‌లో భారత్ ప్రయాణం దాదాపు ముగిసింది. మలేసియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 5-1 తేడాతో విజయం సాధించింది. ఆరంభం నుంచి ఇరు జట్లూ గోల్స్ కోసం పోటీ పడ్డాయి. 11వ నిమిషంలోనే భారత్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. దీంతో భారత్ 1-0 ఆధిక్యం సాధించింది. అయితే, 14వ నిమిషంలో మలేసియా గోల్ సాధించి సమం చేసింది. మళ్లీ 23వ నిమిషంలో భారత్ తరఫున లక్రా గోల్ కొట్టాడు. అక్కడ నుంచి మలేసియాకు ఏమాత్రం అవకాశం



ఇవ్వకుండా భారత ప్లేయర్లు విజృంభించారు. రెండో హాఫ్‌లో మరింత దూకుడుగా ఆడారు. మొత్తం ఐదు గోల్స్ చేసి విజయం ఖాయం చేసుకుని బంగారు పతకం సాధించారు. దీంతో ఒకే ఎడిషన్‌లో మహిళల, పురుషుల విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించడం ఇదే తొలిసారి.

**అంతిమ్‌కు రజతం.. దీపక్‌కు కాంస్యం**

మహిళల 53 కేజీల విభాగంలో రెజ్లర్ అంతిమ్ పంఘాల్ ఫైనల్‌లో ఓడిపోయింది. దీంతో రజతంతో సరిపెట్టుకుంది. ఇక 97 కేజీల పురుషుల రెజ్లింగ్‌లో దీపక్ పునియాకు కాంస్యం దక్కింది.

**చైనానే టాప్.. కానీ**

ఆసియా క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించిన దేశంగా చైనా నిలిచింది. 167 స్వర్ణాలు, 89 రజతాలు, 83 కాంస్యాలు ఉన్నాయి. మొత్తం 339 పతకాలను సాధించింది. గత ఎడిషన్‌తో పోలిస్తే చైనా పతకాలు తగ్గాయి. 201 స్వర్ణాలు, 111 రజతాలు, 71 కాంస్యాలతో 383 పతకాలను అప్పుడు చైనా సొంతం చేసుకుంది. ఇక ఈసారి ఆతిథ్య జపాన్ గతం కంటే చాలా మెరుగ్గా పతకాలను సాధించడం గమనార్హం. 2022లో 188 సాధించగా.. ఈసారి 265 పతకాలకు చేరుకుంది. కొరియాకి కూడా 190 నుంచి 149కి తగ్గిపోయాయి. భారత్ గత ఎడిషన్‌లో 107 రాగా.. ఈసారి 85 పతకాలు మాత్రమే వచ్చాయి.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com